
మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 71 | కర్నూలు | శుక్రవారం 04 ఏప్రిల్ 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi







# థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

## బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,ఏప్రిల్3(శ్రీచక్ర) ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు– థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

# వైకాపా కుటిల రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి

**పాస్టర్ ప్రవీణ్ మరణంపై దమారమే ఇందుకు నిదర్శనం**
**పల్లె నిద్రతో ప్రజా సమస్యలు గుర్తించండి**
**కేబినేట్ భేటీ తరవాత మంత్రులతో సిఎం చంద్రబాబు**



అమరావతి,ఏప్రిల్3((శ్రీచక్ర) రాజకీయ లబ్ది కోసం బట్టకాల్చి మీద వేసే చర్యలకు వైకాపా దిగుతోందని, ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రులను సిఎం చంద్రబాబు హెచ్చరించారు. అలాగే పల్లె నిద్రతో ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఇకపోతే పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైసీపీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయిన సీఎం.. పలు రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ప్రవీణ్ మరణానికి సంబంధించి సీసీ కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని అన్నారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని మంత్రులకు సీఎం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కాస్ ద్వారా దుర్వినియోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టీటీడీలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు. స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు.

# మంగళగిరిని అద్భుతంగా అభివృద్ధి చేస్తా

**క్రమంగా వరుసగా అభివృద్ధి కార్యక్రమాలు**
**ఉండవల్లిలో మన ఇల్లు -మన లోకేష్ కార్యక్రమం**
**దంపతులకు తొలిగా శాశ్వత నివాస పట్టా అందచేత**
**అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని లోకేశ్ హామీ**



గుంటూరు,ఏప్రిల్3(శ్రీచక్ర) యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం ఉండవల్లిలో సీతామహాలక్ష్మికి మంత్రి నారా లోకేష్ ఇంటి పట్టా అందించారు. గురువారం మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాజమండ్రి గోవిందు, సీతామహాలక్ష్మి దంపతులకు ఉండవల్లిలో తొలి శాశ్వత ఇంటి పట్టాను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పం, హిందూపూర్ లాగా మంగళగిరిని టిడిపి కంచుకోటగా నిర్మిస్తానని అన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ ఉచితంగా ఇంటి పట్టాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న చోటే పట్టాలు ఇవ్వాలని కోరారు.. మొదటి విడతగా మూడు వేల మందికి ఇంటి పట్టాలు ఇస్తున్నామన్నారు. అయితే, తాను మొదటిసారి మంగళగిరిలో పోటీచేసి ఓడిపోయా.. మొదటి రోజు బాధపడినా మరుసటి రోజు నుంచి ప్రజల మనసులు గెలవాలని పని చెయ్యడం మొదలు పెట్టానని మంత్రి లోకేష్ వెల్లడించారు. 2024లో నన్ను గెలిపించాలని కోరా.. ఎవరూ ఊహించని విధంగా రికార్డు మెజారిటీతో నన్ను గెలిపించారు అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి పేరుతో దేశంలో ఈ నియోజకవర్గాన్ని నెంబర్ వన్ గా తయారు చేయాలని పని చేస్తున్నాను.. మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరిలో అత్యంత ఆధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తాం.. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతానని అన్నారు. మంగళగిరి చేనేతలు, స్వర్ణకారుల కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపడతామని నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జేసీబీ పాలన పోయి పేదలకు పట్టాలిచ్చే ప్రభుత్వం వచ్చిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 10నెలల్లో మంగళగిరిలో తొలి పట్టాకు శ్రీకారం చుట్టామన్నారు. లోకేష్ గెలిస్తే మంగళగిరిలో ఉన్న ఇళ్లు పీకేస్తారంటూ చేసిన అసత్య ప్రచారం నోర్లు 10 నెలల్లో మూయించామని తెలిపారు. మూడు దశల్లో అన్ని సమస్యలు పరిష్కారం చేసి తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే కీలక హామీ మంగళగిరి నుంచి ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తొలిదశలో 3 వేల మందికి మంగళగిరిలోనే ఇళ్ల పట్టాలు, బట్టలు పెట్టి మరీ అందిస్తున్నామన్నారు. అధికారంలో లేనప్పుడే సొంత ఖర్చులతో 26 సంక్షేమ పథకాలు అందచేశామని అన్నారు. స్వచ్ఛ మంగళగిరి పేరిట స్వచ్ఛతలో మంగళగిరి దేశంలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ఇటీ–వల మంత్రివర్గంలో ఆమోదం పొందిన 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో 50కి పైగా పథకాలు మంగళగిరిలో అమలయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అన్ని రంగాల్లో మంగళగిరిని నెంబర్ 1 స్థానంలో నిలబెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యేగా కృషి చేస్తున్నానని తెలిపారు. రెడ్ బుక్ కోసం పోలీసులు పనిచేస్తే తప్పేముందని మంత్రి ప్రశ్నించారు. చట్టవిరుద్ధంగా పని చేసిన వారిని రెడ్ బుక్‌లో చేర్చుతామని నాడు చెప్పా.. ఇప్పుడు పోలీసులు చట్ట ప్రకారం పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం పోయి తిరిగి అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. రెడ్ బుక్ దెబ్బకి ఒకరికి గుండెపోటు వస్తే మరొకరు చెయ్యి విరకొట్టుకున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ కుట్రల పట్ల ప్రభుత్వంతో ప్రజలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కుల, మత ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టడంలో వైసీపీ నేతలు ఆరితేరారని మండిపడ్డారు. అందుకే ఫాస్టర్ ప్రవీణ్ మరణం దర్యాప్తుపై ఆయన కుటుంబసభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నా, వైసీపీ రాజకీయ లబ్ది పొందాలని చూస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కుట్రలకు ఆ పార్టీ వెనుకాడదన్నారు. సొంత తల్లి, చెల్లికి సమాధానం చెప్పుకోలేని జగన్ ఇక ప్రజలకు ఏం చెప్తారని ప్రశ్నించారు. విజనరీ, పిజనరీకి తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. విజనరీ భవిష్యత్తు తరాలు గురించి ఆలోచించి ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తారన్నారు. నాడు కంప్యూటర్‌లు అన్నం పెడతాయా అని విమర్శించిన వాళ్ళు ఉన్నారని అన్నారు. 90వ దశకంలో చంద్రబాబు ఏం చేశారో ఇప్పుడు చాలా మంది సమీక్షిస్తున్నారన్నారు. పీజనరీ చూపు ఎప్పుడు జైలు వైపు, విధ్వంసం వైపే ఉంటు–ంది కాబట్టి పీ4 ఫలాలు తెలియవంటూ మంత్రి లోకేష్ వ్యాఖ్యలు చేశారు. కాగా.. మంగళగిరిలో దశాబ్దాల సమస్యకు 10 నెలల్లో పరిష్కారం చూపారు మంత్రి లోకేష్. మొదటి విడతలో ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 3 వేలమందికి శాశ్వత పట్టాలు అందజేయనున్నారు. స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందచేసేలా లోకేష్ ప్రణాళికలు రూపొందించారు. 12వ తేదీ వరకు నియోజకవర్గంలో మన ఇల్లు – మన లోకేష్ కార్యక్రమాన్ని మంత్రి లోకేష్ స్వయంగా చేపట్టనున్నారు.

# పవన్ కళ్యాణ్‌తో నాగబాబు భేటీ

## అన్నకు శుభాకాంక్షలు తెలిపిన తమ్ముడు

అమరావతి,ఏప్రిల్3((శ్రీచక్ర) ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను గురువారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు



మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వీరిద్దరూ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అయితే, ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నాగబాబుకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన కొణిదెల నాగబాబు.. ఏప్రిల్ 2వ తేదీ నాడు ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నాడు మధ్యాహ్నం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబుకు మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ విధాన పరిషత్ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన తమ్ముడు నాగబాబుకి అన్నయ్య, వదిన ఆత్మీయ అభినందనలు, ఆశీస్సులు తెలియజేస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# తిరుపతి–పళని బస్ సర్వీస్ ప్రారంభం

**పుణ్యక్షేత్రాల సందర్శనకు మంచి అవకాశం**
**మంగళగిరిలో ప్రారంభించిన డిప్యూటి సిఎం పవన్**

అమరావతి,ఏప్రిల్3( :తిరుపతి – పళని బస్సు సర్వీసును డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభోత్సవం చేశారు. భక్తుల అవసరాలను అర్థం చేసుకున్నాను.. అందుకే తిరుపతి–పళని బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నాం అన్నారు.. మంగళగిరి జనసేన కార్యాలయంలో తిరుపతి – పళని బస్సు సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.. ముఖ్య అతిథిగా డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ హాజరుకాగా.. ఈ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు..

# కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్


**అభివృద్ధి చెందుతున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ గురించి చర్చించిన టి.జి భరత్**



ఢిల్లీ, ఏప్రిల్ 3 (శ్రీచక్ర): కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా కర్నూలు నుండి ముంబైకి మరియు కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు టి.జి భరత్ తెలిపారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కర్నూలు రాజధానిగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ ఈ ప్రాంతాన్ని రైల్వే పరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని విన్నవించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎన్నో పరిశ్రమలు రానున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. భవిష్యత్తులో ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఓర్వకల్లు మారబోతుందన్నారు. ఈ ప్రాంతానికి దేశంలోని ప్రధాన నగరాలతో రైలు రాకపోకలు ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు టి.జి భరత్ తెలిపారు. ఈ రైల్వే సౌకర్యాలపై తప్పకుండా పరిశీలిస్తామని ఆయన చెప్పారన్నారు.

# డ్రోన్ కార్పొరేషన్ స్వతంత్ర విభాగంగా ఏర్పాటు

**అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టుకు అనుమతి**
**ప్రీమియం హోటళ్ల బార్ లైసెన్స్ ఫీజు తగ్గింపు**
**మీడియా నూతన అక్రిడేషన్ల నిబంధనలకు ఆమోదం**
**ఎపి కేబినేట్‌లో పలు అంశాలపై చర్చ**



అమరావతి,ఏప్రిల్3 (శ్రీచక్ర) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. డ్రోన్ కార్పొరేషన్ స్వతంత్ర విభాగంగా ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టుకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. విద్యుత్ శాఖలో రూ.710 కోట్ల రుణం కోసం హడ్కోకి ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. సాగర్ ఎడుమ కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో త్రీస్టార్ సహా ఇతర ప్రీమియం హోటళ్ల అభివృద్ధికి బార్ లైసెన్స్ ఫీజు తగ్గింపు ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖల్లో వివిధ జీవోల రేటిఫికేషన్‌కు కూడా ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. మీడియా అక్రిడేషన్ల నూతన నిబంధనలకు ఆమోదం తెలిపింది. నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా వెంపాడులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.45 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును జలహారతి కార్పొరేషన్ పేరిట ప్రత్యేక వాహక ప్రాజెక్టుగా పరిగణిస్తూ ఎపి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను (ఏపీడీసీ) ఆంధప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటె–డ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) నుంచి విడదీసి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు–చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
శుక్రవారం 04 ఏప్రిల్ 2025

# సంపాదకీయం

## హద్దుల్లో ఉంటూ..పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామీలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ధి చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగుతున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అర్జంటుగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్‌ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విపక్ష బిఆర్‌ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు.

ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టుల కుంభకోణాలు,అవినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. వారి పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శలు వచ్చాయి. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు. ఈ క్రమంలో గతంలో, ఇప్పుడు అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజలే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ.. ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి అసలుసిసలు కృషి చేయాలి. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చుకోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. ఉచిత పథకాలకు పాతరేయాలి. సన్న బియ్యం ఇస్తున్నామని చంకలు గుద్దుకోకుండా..అర్హులకు అదీ ధరలు పెంచి ఇవ్వాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు కూడా నిజాలు గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండదు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప ముమ్ముందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. బీఆర్‌ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా అన్నది పనుల్లో చూపాలి. ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళ్లు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెస్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు. సిఎం రేవంత్ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి.

# అదిలాబాద్ లో కొత్త విమానశ్రయం

అదిలాబాద్,ఏప్రిల్ 3, (శ్రీచక్ర) )తెలంగాణలో మరో కొత్త విమానాశ్రయం రాబోతోంది. ఆదిలాబాద్ జిల్లాలో కొత్త ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. దీనిలో భాగంగానే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర కార్యకలాపాల కోసం అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ అభ్యర్థనను పరిశీలించిన తర్వాత.. భారత వైమానిక దళం పౌర విమాన కార్యకలాపాలను అనుమతించడానికి అంగీకరించింది. అంతే కాకుండా.. ఆ ప్రదేశంలో శిక్షణా సంస్థను ఏర్పాటు చేయడానికి భవిష్యత్తు ప్రణాళికలను కూడా పరిశీలిస్తోంది.తెలంగాణ ప్రభుత్వ రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి రాసిన అధికారిక లేఖలో.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి ఈ ఎయిర్‌ఫీల్డ్‌ను జాయింట్-యూజర్ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సూచించింది. దీని వలన ఎంఎ సివిల్ టెర్మినల్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, సహాయక మౌలిక సదుపాయాల కోసం పక్కనే ఉన్న భూమిని సేకరించాల్సి ఉంటుంది. నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేయడానికి వివరణాత్మక ప్రతిపాదనను సమర్పించాలనికి సూచించబడింది. ఈ ఆమోదంతో.. విమానాశ్రయం వాయుసేన అవసరాలకు అనుగుణంగా ఉపయోగించబడే అవకాశాలు పెరగనున్నాయి. అంతే కాకుండా.. ఈ విమానాశ్రయం మరింత అభివృద్ధి చెందడానికి.. అవసరమైన మౌలిక సదుపాయాలు అందించబడతాయి. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర విమానయానంతో పాటు.. జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేక ప్రణాళిక కూడా సిద్ధం చేస్తోంది. నూతన టర్మినల్ నిర్మాణం, విమానాల నిలిపివేత, నియంత్రణ టవర్ వంటి నిర్మాణాలు.. ప్రయాణికుల కోసం ఆధునిక ఫెసిలిటీల కల్పన వంటి ఏర్పాట్లు చేయనున్నారు. ఈ పనులన్నీ త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఆదిలాబాద్ ప్రాంతం అనేక విధాలుగా ప్రయోజనాలు పొందనుంది. అలాగే ఇక్కడి స్థానిక ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడనున్నాయి. భూముల ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతం.. హైదరాబాద్ వంటి ప్రాంతాలతో పోటీ పడనుంది. కొత్త ఎయిర్ పోర్ట్ కార్యకలాపాలకు భారత వాయు సేన అనుమతి మంజూరు చేయడం గర్వకారణం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో అంతక ముందు.. మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతులు సాధించిన ప్రభుత్వం.. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో కూడా ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు కీలక అడుగు పడింది. తెలంగాణలో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండు విమానాశ్రయాలకు అనుమతులు తెచ్చుకోవడం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అద్భుత కృషికి నిదర్శనం అన్నారు. విమానాశ్రయం కోసం ఆర్అం డ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులకు లేఖ రాయగా బుధవారం అక్కడి నుంచి సమాధానం వచ్చింది. ఆదిలాబాద్‌లో పౌరవిమానాశ్రయానికి అనుమతి నేపథ్యంలో అక్కడ భవిష్యత్తులో ఎయిర్‌ఫోర్స్ ట్రెయినింగ్ సెం టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ ఫోర్స్ డైరెక్టర్ సనప్ బాజీరావు రామ్‌నాథ్ తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని పౌర విమానయానం, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జా యింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. మరోవైపు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ వచ్చిన నేపథ్యంలో ఆదిలాబాద్ జి ల్లా ప్రజలతో పాటు, రాష్ట్ర ప్రజలకు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శు భాకాంక్షలు తెలిపారు. అనుమతుల మంజూరీలో సహకరిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి ధన్యవాదాలు తెలిపారు.

# సూర్జాపూర్ లో పోలీస్ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై అవగాహన

### నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి

తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సూర్జపూర్ గ్రామంలో గురువారం రోజున నకిలీ పత్తి విత్తనాలపై పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అక్కడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గుతుందన్నారు. అదేవిధంగా పర్యావరణం పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. కౌలు రైతులు కూడా ఈ నకిలీ విత్తనాలను వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. ఈ నకిలీ విత్తనాలు వాడటం వల్ల రెండు మూడు క్వింటాళ్లు అధిక లాభం వస్తుందని ఆశపడితే పంట నష్టపోయిన తర్వాత కూడా మీకు ప్రభుత్వం నుండి ఎలాంటి నష్టపరిహారం వాటిల్లదు. నకిలీ పత్తి విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదని ఒకవేళ గుట్టుచప్పుడు కాకుండా దొంగ చాటున వీటిని పంట పొలాల్లో విత్తనాలు నాటుతున్నారని సమాచారం అందిన వెంటనే అక్కడికి వచ్చి పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క రైతు ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయానికి సంబంధించిన ఏ విత్తనాలు తీసుకున్న తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వారు చెప్పే సూచనలు పాటిస్తే మీకు అధిక దిగుబడి రావడంతో పాటు లాభాలు కూడా రావడం జరుగుతుందన్నారు. ఈ యొక్క గ్లైపోసిట్ నకిలీ విత్తనాలు వాడడం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎవరు కూడా ఇలాంటి నకిలీ విత్తనాలను అమ్మడం, కొనడం కానీ చేయకూడదని అదే విధంగా ఏ గ్రామంలోనైనా ఈ యొక్క నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి సబ్ ఇన్స్పెక్టర్ గంగారం,మండల వ్యవసాయ అధికారి సాయి,పోలీస్ సిబ్బంది,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే..

### మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి

### శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, Xజర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు విజ్ఞప్తి

హైదరాబాద్ ఏప్రిల్ 3(శ్రీచక్ర) ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన చేస్తున్నామన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరౌలి), ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యాకాండలను, నరసంహారాన్ని(జినోసైడ్) నిలిపివేయాలని , సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే తాము తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తామని వెల్లడించారు. తాము చేస్తున్న ఈ ప్రతిపాదనల ఆధారంగా శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు, ఆదివాసీ, దళిత సంఘాలకు, విద్యార్థియువజనులకు, పర్యావరణ కార్యకర్తలు తదితరులందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, నగరాల్లో, జిల్లా, తాలూకా కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయిన్‌ను చేపట్టాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను కూలదోసి సమసమాజ స్థాపన కోసం పోరాడుతుంటే బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రజా పోరాటాలను నిర్మూలించడం కోసం తూర్పు, మధ్యభారతంలో కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనల నుండి దేశంలోని పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడిత జాతుల విముక్తి కోసం మా పార్టీ పోరాడుతుంటే ఆ పోరాటాలను అణిచివేయడానికి పట్టణాల్లో, మైదానాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయుధ పోలీసు బలగాల్ని, ఎన్ఐఎ లాంటి ఇంటలిజెన్స్ ఏజెన్సీలను ఉపయోగించి పోరాడే ప్రజానీకంపై దాడులు చేస్తున్నాయని సదరు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపక్ష మేధావులపై భీమాకోరేగావ్ కుట్ర కేసును మోపి జైళ్లో బంధించాయన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో ఆదివాసీ యువతీయువకులను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకుని వారిచేతనే ఆదివాసులను హత్యలు చేయిస్తున్నాయని ప్రకటనలో వెల్లడించారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్‌లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటు నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటా.. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయన్నారు. ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైబడిన సంఖ్యలో తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లను, సభ్యులను, సాధారణ ఆదివాసీ ప్రజానీకాన్ని హత్య చేశాయన్నారు. ఇందులో 1/3 సంఖ్యలో సాధారణ ఆదివాసీ ప్రజలు హత్య చేయబడ్డారన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైళ్ల పాల్జేస్తున్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో 'మధ్యభారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలి. భారత ప్రభుత్వంసిపిఐ(మావోయిస్టు) బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలి' అనే అంశంపై మార్చి 24న హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందన్నారు. నేటి స్థితిలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, అది శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శాంతి చర్చల పట్ల తమ పార్టీ వైఖరిని తెలియపరుస్తూ.. పజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనని సదరు ప్రకటనలో పేర్కొన్నారు.

## పశ్చిమ బెంగాల్లో 25000 టీచర్ నియమకాలను రద్దు చేసిన సుప్రీంకోర్టు

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 3 పశ్చిమ బెంగాల్లో 2016లో చేపట్టిన 25000 టీచర్ నియమకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. భారత దేశ ఉన్నత న్యాయ స్థానంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి ఎదురు దెబ్బతగిలింది. 25000 వేల టీచింగ్ నాన్ టిచింగ్ సాఫ్ట్ నియామకాలను 2024లో కోల్‌కతా హైకోర్టు రద్దు చేసిన విషయం తెలిసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. హైకోర్టు తీర్పులో జోక్య చేసుకునేందుకు సరైన కారణాలు కనిపించడంలేదని పేర్కొంది. దీనికింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తెలిపింది.

## విస్తరణ మరింత ఆలస్యం...

హైదరాబాద్, ఏప్రిల్ 3, (శ్రీచక్ర) )తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా పడే అవకాశాలే ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్‌లు తెరపైకి వచ్చాయి. మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితి మారింది. దీంతో, కొత్త జాబితా కోసం పార్టీ నేతలు మళ్లీ కసరత్తు ప్రారంభించారు, మరో ఇద్దరి పేర్లు చర్చలోకి వచ్చాయి. రాష్ట్ర కేబినెట్‌లో ఆరు స్థానాలు ఖాళీగా ఉండగా, సామాజిక, ప్రాంతీయ సమీకరణల ఆధారంగా నలుగురిని ఎంపిక చేసేందుకు గత నెలలో ఢిల్లీలో నిర్ణయం జరిగింది. ఉగాది సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిగవర్నర్‌తో సమావేశంలో కూడా విస్తరణ గురించి సూచనలు ఇచ్చారు. కానీ, రాహుల్ గాంధీ కొమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటికే కొమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండగా, ఆయన సోదరుడికి మరోసారి అవకాశం ఇవ్వడం ఎందుకని రాహుల్ ఆరా తీశారు. అయితే, రాజగోపాల్‌కు పార్టీలో చేరినప్పుడే మంత్రి పదవి హామీ ఇచ్చామని నేతలు వివరించినప్పటికీ, తుది నిర్ణయం కోసం వేచి చూడాలని రాహుల్ సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. సీనియర్ నేత జానారెడ్డి హైకమాండ్‌కు రాసిన లేఖ సంచలనంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదని, వాటికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సామాజికవర్గాల వారీగా కూడా పలువురు నేతలు ఢిల్లీలో లాబీయింగ్‌ను తీవ్రతరం చేశారు. ఇప్పటివరకు సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వట్టిక శ్రీహరి, వివేక్ పేర్లు ఖరారైనట్లు ప్రచారం జరిగినా, రాహుల్ అభ్యంతరంతో ఈ జాబితాలో మార్పులు సంభవించే సూచనలు కనిపిస్తున్నాయి. సీనియర్లు, సామాజిక అంశాలు, జిల్లాల ప్రాతినిధ్యం వంటి అంశాలు తెరపైకి రావడంతో విస్తరణ జరగడం అనుమానంగా మారింది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలు ఢిల్లీలోనే ఉన్నారు. దీంతో, ఈ రోజు మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో కీలక నిర్ణయాలు జరిగే అవకాశం ఉంది.

## స్క్రాప్ తో 500 కోట్ల ఆదాయం

హైదరాబాద్,ఏప్రిల్ 3, (న్యూస్ పల్స్)2024 ఆర్థిక సంవత్స రంలో స్క్రాప్ అమ్మకం ద్వారా గతం లో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మ ధ్య రైల్వే ఆదాయం గడిచింది. రూ. 430 కోట్ల లక్ష్యాన్ని దాటి రికార్డు స్థాయిలో రూ.501.72 కోట్ల ఆదా యాన్ని పొందింది. గత ఆర్థిక సంవ త్సరంలో స్క్రాప్ అమ్మకం ద్వారా రూ.411.39 కోట్లు రాగా ఈ ఏడాది గణనీయ మార్పు కనిపించిందిఈహూ ద్వారా ఆన్ లైన్‌లో నిర్వహించిన ఈ అత్యంత పారదర్శకంగా స్క్రాప్ అమ్మకాలు సాగించినట్టు ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపా రు. ద.మ. రైల్వే మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ మిషన్‌లో భాగంగా జీరో స్క్రాప్ ప్రాజెక్ట్ లక్ష్యా న్ని అమలు చేస్తోంది. ఇందులో భా గంగా తుక్కును వెంటనే గుర్తించ డంతో పాటు సాధ్యమైనంత త్వరగా ఒక ట్రక్ లోడ్ పరిమాణంలో స్క్రాప్ పేరుకుపోకుండా చర్యలు తీసుకొం టోంది. దీంతో పాటు స్క్రాప్ సామ గ్రి అమ్మకం ద్వారా ఖజానాకు ఆర్థిక వనరుగా దోహదపడుతున్నది. కేం ద్రం చేపపట్టిన స్వచ్ఛ భారత్ అభి యాన్ ప్రాజెక్టుకు కూడా ఈ స్క్రాప్ విధానం ఎంతగానో దోహదపడిం దని జీఎం తెలిపారు. ఈ ఘనత సా ధించేందుకు కారణమైన మెటీ రియ ల్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ బృందం చేసిన కృషిని జీఎం ప్ర శంసించారు.

## ఫార్మా సీటికోసం సర్వే

యాచారం,రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్, పట్టా భూములను అధికారులు సర్వే చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులకు గురి చేయకుండా శాంతియుతం గా నచ్చజెప్పి సేకరించిన భూములను సర్వే చేసి, ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. 40 నుంచి 60 రోజుల్లోపు సర్వే పూర్తి చేసేలా అధికా రులు చర్యలు తీసుకుంటున్నారు. యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో ఇద్దరు ఆర్ ఐలు, ఇద్దరు సర్వేయర్లు, మరో ఆరుగురు రెవెన్యూ, టీజీఐఐసీ సిబ్బంది సర్వేలో పాల్గొన నున్నారు. వీరే కాక ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనం త్రెడ్డితో పాటు ఏసీపీ కేపీవీ రాజు ఇతర ఉన్నతా ధికారుల బృందం సైతం సర్వే, ఫెన్సింగ్ వేసే విషయంలో భాగస్వాములు కానున్నారు. ఎలాంటి అవాంచనీయా సంఘటనలు కాకుండా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు.

## ప్రైవేటు ఆసుపత్రులు.. వివరాలను 10 రోజుల్లో పంపాలి

### ఏప్రిల్ 10 వరకు స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్‌బ్యాక్ గడువు పొడిగింపు

### నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వర్ రెడ్డి వెల్లడి



కర్నూలు,ఏప్రిల్ 3 (శ్రీచక్ర): నగరంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో సంభవించిన జననాలు, మరణాల వివరాలను పది రోజుల్లోగా నగరపాలక సంస్థకు పంపాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలను పంపడంలో జాప్యం చేస్తే ఒక్కొక్క జననము, మరణము మీద రూ.2 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని, ఆ రుసుమును సంబంధిత ఆసుపత్రి యాజమాన్యమే భరించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఆ రుసుమును యాజమాన్యం ప్రజల నుండి వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే, ఆ ఆసుపత్రి సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఓలకు సిఫార్సు చేయడం జరుగుతుందని ప్రజారోగ్య అధికారి హెచ్చరించారు.×స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్‌బ్యాక్ ఏప్రిల్ 10 వరకు పొడిగింపుదేశవ్యాప్తంగా నగరాల్లో, పట్టణాల్లో స్వచ్ఛత పనులపై అభిప్రాయాలను సేకరించేందుకు చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్ ఫీడ్ గడువును ఏప్రిల్ 10 వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించిందని ప్రజారోగ్య అధికారి తెలిపారు. ఇంకా ఫీడ్‌బ్యాక్ ఇవ్వని పౌరులు తక్షణమేఈలింకు https://sbmurban.org/feedback ద్వారా అభిప్రాయాలను తెలిపి, నగరాన్ని జాతీయస్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు సహకరించాలని ప్రజారోగ్య అధికారి కోరారు.

## పాఠశాలల బలోపేతానికి కృషి:ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి

### -నియోజకవర్గ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



మంత్రాలయం, ఏప్రిల్3(శ్రీచక్ర) : అక్షరాస్యతలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగి రెడ్డి అన్నారు.రాంపురంలోని స్థానిక ఎమ్మెల్యే స్వగృహం నందు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల విద్యాశాఖ అధికారులతో వై బాలనాగిరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. జీవో నెంబర్ 117 రద్దుతో క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ ద్వారా ప్రాథమిక,ఉన్నత పాఠశాలల యందు విద్యార్థులకు అనుగుణంగా ఎంతమంది ఉపాధ్యాయుల అవసరం, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన వంటి వివిధ అంశాలపై విద్యా శాఖ అధికారులు సమర్పించిన నివేదికలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకు న్నారు.ముఖ్యంగా తల్లిదండ్రులు వలసలకు వెళ్ళితే, చదువుకొనే విద్యార్థి, విద్యార్థులను వలసబాట పట్టకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మంత్రాలయం, కోసిగి,కౌతాళం,పెద్దకడుబూర ుమండలాలఎం ఈఓలురాఘున్న, రామాంజనే యులు, శోభారాణి,సువర్ణ సునీయం,రామ్మూర్తి, మంత్రాలయం మండల కన్వీనర్ బీమారెడ్డి గారు,పిఏ వెంకట్రామిరెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్ తో ప్రజల భద్రతకు భరోసా



కర్నూలు, ఏప్రిల్ 3 (శ్రీచక్ర): విజిబుల్ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు . కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.



## పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి





కర్నూలు లీగల్, ఏప్రిల్ 3 (శ్రీచక్ర) : కర్నూలులోని ఇందిరాగాంధీ నగర్ లో ని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. వసతి గృహానికి సంబందించిన రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించి నిర్వాహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి నిరాశ్రయులను అడుగగా వారు బాగా లేవని జడ్జికి తెలిపారు. జడ్జి సంబధిత అధికారులతో మాట్లాడి అక్కడి సౌకర్యాలను మెరుగు పరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకురాలు శకుంతల తదితరులు పాల్గొనారు.

## ఓర్వకల్లు విమానాశ్రయం లో ప్రయాణికుల అవసరాల మేరకు ఏర్పాట్లు చేయండి:జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య





కర్నూలు, మార్చి 3 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాలులో ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఏర్పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్ ను ఆదేశించారు. ఎయిర్పోర్ట్ ఆవరణంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అందులో పండ్లను ఇచ్చే చెట్లు లేకుండా చూడాలని కోరారు. జిల్లా అధికారులు అందరూ ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఎయిర్పోర్టులోని చెత్తను గతంలో లాగా డంప్ యార్డు ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు ఎంపీడీవోకు సూచించారు.ఈ సందర్భంగా ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ 2024 సంవత్సరం లో ఏర్పోర్ట్ నందు యాంటీ హైజాక్ మరియు బాంబు బెదిరింపు కు చెందిన మాక్ డ్రిల్ నిర్వహించుకున్నామని జాయింట్ కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సమావేశానికి ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డి ఎం అండ్ హెచ్ ఓ శాంతి కల, కర్నూలు డి ఎస్ పి బాబు ప్రసాద్, ఐబి డి ఎస్ పి మధు ,ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, డిడి మైన్స్ రవిచంద్ర, ఎలక్ట్రికల్ డి ఈ శేషాద్రి, ఎంపీడీవో శ్రీనివాసులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మళ్లీ మొదలైన స్మశానవాటిక స్థల వివాదం -రెవెన్యూ, పోలీసు అధికారులు బందోబస్తు మధ్య అంత్యక్రియలు





మంత్రాలయం , ఏప్రిల్ 3, (శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని చెట్నెహళ్ళి గ్రామంలో స్మశానవాటిక స్థల వివాదం మళ్ళీ మొదలైంది. గురువారం గ్రామానికి చెందిన తలారి నాగేంద్ర భార్య లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో ఖననం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు తమ ఇళ్ల ముందు పూడ్చుతున్నారని తహసీల్దార్ ఎస్ రవి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు విఆర్ఓ భీమయ్య ఎస్సై శివాంజల్ గ్రామానికి చేరుకొని ఎస్సీ సామాజిక వర్గం వారు నిర్మించుకున్న ఇళ్లకు సుమారు నూటయాభై అడుగుల దూరంలో ఆమె మృత దేహాన్ని పూడ్చి సమస్యను తాత్కాలికంగా పూర్తి చేశారు. విఆర్ఓ నిర్వాకం వల్లే మళ్లీ శవాన్ని పూడ్చకుండా అడ్డుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అయితే గ్రామంలో ఎవరు చనిపోయినా అధికారులు పోలీసుల సమక్షంలో ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొందని దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోరంబోకు స్థలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చి సమస్యగా మార్చారని విఆర్ఓ తప్పిదం వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొందన్నారు. తహసీల్దార్ ఎస్ రవి, ఎస్సై శివాంజల్, విఆర్ఓ భీమయ్య సాక్షిగా మృతదేహాన్ని ఖననం చేసి ప్రస్తుతానికి సమస్యను పరిష్కరించారు. గతంలో కూడా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కూడా శ్మశాన స్థల వివాదం స్పందించి సమస్య పరిష్కారం అయ్యే వరకు యథావిధిగా కొనసాగించాలని ఆదేశించారని ఆయన ఆదేశాలు కూడా విఆర్ఓ బేఖాతరు చేశారని ఇలాంటి అధికారుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోండి..

### వినియోగదారుల విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించండి..
### విద్యుత్ సబ్ స్టేషన్ల స్థల సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయండి..
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..

నంద్యాల, ఏప్రిల్ 03:- (శ్రీచక్ర): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించి ప్రజలలో అవగాహన తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యుత్ అధికారులు, వెండర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథక అమలుపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలలో అవగాహన తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 87,632 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సూర్య ఘర్ సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. పీఎం సూర్య ఘర్ సంబంధించి ప్రతి నియోజకవర్గంలో పదివేల ఇళ్లపై సోలార్ ఫలకలు ఏర్పాటు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారని కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి లక్ష గృహాలకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికల సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక కిలో వాట్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 30 వేలు, రెండు కిలో వాట్ లకు 60 వేలు, మూడు కిలోమీటర్ యూనిట్లకు 78 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుండి రుణం సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రతి ఇంటింటికి వెళ్లి వినియోగదారులకు వివరించేలా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లను ఆదేశించాలని విద్యుత్ ఈఈ, డిఈలను కలెక్టర్ సూచించారు. సోలార్ ప్యానల్ నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును పవర్ గ్రిడ్ కు పంపించి గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా అందించే విషయాన్ని కూడ వినియోగదారులకు స్పష్టంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. మండలాలో స్థానికంగా ఉన్న వెండర్లను గుర్తించి ఆయా ప్రాంతాలను కేటాయించాలని కలెక్టర్ సూచించారు. నమోదు చేసుకున్న వినియోగదారులకు ఆలస్యం లేకుండా త్వరితగతిన ఆమోదించి సోలార్ ప్యానల్ ఏర్పాటుకు వెండర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్యానెల్ లను చెన్నై, బెంగళూరు, హైదరాబాదులో నుండి ముందుగానే

## ఇనాం భూములు కబ్జాకు గురికాకుండా చూడాలి

### -ఏపీ ఎంఆర్ పిఎస్ జిల్లా నాయకులు నేపాల్



మంత్రాలయం , ఏప్రిల్ 3, (శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో సర్వే నంబర్ 62 లో ఉన్న లక్ష్మమ్మ అవ్వ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామికి సంబంధించిన భూములను కబ్జాకు గురికాకుండా చూడాలని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు గుండు పోగుల నేపాల్ మంత్రాలయంతహశీల్దార్ రవినికోరారు. గురువారం మంత్రాలయం తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల అధికారులు అక్రమదారుల దగ్గర ముడుపులు తీసుకోని ఫేక్ మరణ ధ్రువీకరణ పత్రాలను మరియు ఫేక్ ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్లును పెట్టి అక్రమంగా ఇనాం భూములను కబ్జా కోరుల చేతుల్లో పెడుతున్నారాన్నారు. ఇలాంటి వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇలాంటి వారిపై ఇప్పటికైనా అధికారులు స్పందించిచర్యల తీసుకోవాలనిహెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏపీ ఎంఆర్ పిఎస్ నాయకులు ఈమానిల్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు కోర్టు స్టాంపులు కొరత లేకుండా చూస్తాం





కర్నూలు, మార్చి 3 (శ్రీచక్ర): న్యాయవాదులకు కోర్టు స్టాంపుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్ చౌదరి, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శులుగా హరినాథ్ చౌదరి, వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను, ఆఫీసులో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ నూతన కమిటీ జనరల్ సెక్రెటరీ బాలసుబ్రమణ్యం, స్పోర్ట్స్ సెక్రటరీ సుధాకర్, న్యాయవాదులు నాగముని తదితరులు పాల్గొన్నారు.







తెప్పించుకోవాలని వెండర్లకు కలెక్టర్ సూచించారు.పీఎం కుసుం పథకం కింద జిల్లాలో 130 విద్యుత్ సబ్ స్టేషనులకు అవసరమైన స్థలాల సేకరణకు ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. మిడుతూరు మండలం కడుమూరు గ్రామంలో 143 ఎకరాల స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు గుర్తించిన మూడువేల ఎకరాలను కూడా విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సుధాకర్ కుమార్, ఈఈ టెక్నికల్ నాగేశ్వరరావు, నంద్యాల ఈఈ శ్రీనివాసులరెడ్డి, డోను ఈ ఈ కమలాకర్ రావు, ఎల్డిఎం రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భ కంద్రిగ భూముల రైతులను ఆదుకుంటాం

### జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్





కోట ఏప్రిల్ 3 (శ్రీ చక్ర) : గర్భ కంద్రిక భూముల రైతులను ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు.గురువారం కోట మండలం వెంకన్నపాలెం గ్రామ పంచాయతీలోని గర్భ కంద్రిగ భూములను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్,సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి రైతులు వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకములు,రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు,కుటుంబ బాగ పంపక పత్రాలు పరిశీలించారు.రైతుల చెప్పిన పలు విషయాలు విన్నారు.ఈ సందర్భంగా రైతులు వెంకన్నపాలెం గ్రామములో సర్వేనం 1056 ఎ,1056 ఎ. 1090 ఎ,1090 8,1095 ఎ, 1095 8,1129 ఎ,1129 8, 1131,1163,1,1163,3 సర్వే నంబర్లలో 342.77 సెంట్లు భూమి ఇనాం అబాలిషన్ చట్టం ప్రకారము రద్దుపరచి ఉన్నారని మాకు న్యాయంచేయాలనిజాయింట్కలెక్టర్దృష్టికితీసుకెళ్లారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ పదిరోజులు తర్వాత మరలా మరొకసారి వచ్చి పరిశీలించి ప్రతి రైతుకు న్యాయం చేస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో తాహసిల్దార్ కటారి.జయ జయ రావు,మండల సర్వేయర్ గోపిరెడ్డి, కోటఎస్సై పవన్ కుమార్,ఆర్ఐ మధులత,వీఆర్వో కృష్ణ,రెవిన్యూ సిబ్బంది, వెంకన్నపాలెంగ్రామ సర్పంచ్ కోకర్ల.మధు యాదవ్,తదితరులు ఉన్నారు.

## గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కోటలో రోడ్డు అభివృద్ధి పనులు వేగవంతం

### రవినగర్ లో ముమ్మరంగా సిమెంట్ రోడ్డు పనులు రోడ్డు పనులను

### పరిశీలిస్తున్న తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్





కోట ఏప్రిల్ 3 (శ్రీ చక్ర): కోట మండలంలోని రవి నగర్ సమీపంలో నుండి కోట ఎస్సీ గురుకుల పాఠశాలకు వెళ్లే వీధిలోసిమెంట్ రోడ్డునిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.ఈ మేరకు గురువారం తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులుషేక్జలీల్అహ్మద్వేగవంతంగాజరుగుతున్న రోడ్డు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కోట మండలంలో జరుగుతున్న రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేసి కోట ప్రజలకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు.అంతేకాకుండా కోట పట్టణంలో అవసరమైన చోట్ల రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ షంషుద్దీన్,టిడిపి సీనియర్ నాయకులు తీగల.సురేష్ బాబు,వార్డ్ మెంబర్ బాబు,తదితర టిడిపి నాయకులు ఉన్నారు.

## నేడు కార్పొరేషన్ లోన్లకు ఇంటర్వ్యూలు



రామచంద్రపురం, ఏప్రిల్ 3( శ్రీచక్ర)జిల్లా వెనుక బడిన తరగతుల సేవ సహకార సంఘం-స్వయం ఉపాధి పదకాలు క్రింద వివిద కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సహాయము కొరకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులతో శుక్రవారము ఉదయం గం.11.00 లకు శ్రీ కృత్తివెంటి పెర్రాజు పంతులు జూనియర్ కాలేజీ,నందు ఇంటర్వ్యూలు జరపనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాయుడు పేర్కొన్నారు . ఈ మేరకు గురువారం కమిషనర్ విషయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రామచంద్రపురం నందు వివిద బ్రాంచ్ మేనేజర్లు వార్లచే ఏర్పాటు చేసిన “ఇంటర్వ్యూ” లకు దరఖాస్తు దార్లు అందరూ మీయొక్క దరఖాస్తుతో పాటుగా పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, క్యాస్ట్ సర్టిఫికేట్ తోపాటు బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ 3 కాపీలు తీసుకొని తప్పక హాజరు కావాలని తెలియజేశారు.

# ఆర్యావటంలో ఇబ్బడిముబ్బడిగా ఆక్వా చెరువులు తవ్వకాలు!

అదికారులు పట్టించుకోరు నిబంధనలు బేఖాతరు

స్థానిక రెవెన్యూ యంత్రాంగనికి తెలిసే తవ్వకాలు

ఇప్పటికే వందలాది ఎకరాలు ఆక్వా చెరువులు

-మరిన్ని తవ్వకానికి సన్నాహాలు

ఆక్వా చెరువులుతో నష్టపోతున్నాం అంటున్న రైతాంగం

అనుమతులు లేకున్నా యదేచ్ఛగా తవ్వకాలు

నీరందటం లేదనేసాకుతో మరిన్ని ఆక్వా చెరువులు తవ్వకాలు

చెరువుల తవ్వకానికి అనుమతులు లేవన్న తాసిల్దార్

నిబంధనలు అతిక్రమిస్తే పైన్ వేసి ఆపై కలెక్టర్ దృష్టికి రిపోర్టు

కాజులూరు తహసీల్దార్ ఠాగూర్ వెల్లడి









కాజులూరు మార్చి ఏప్రిల్ 3(శ్రీచక్ర)స్థానిక రెవెన్యూ యంత్రాంగం అండదండలతో కాజులూరు మండలం ఆర్యావటం రెవిన్యూ పరిధిలో కొత్తగా ఆక్వా చెరువులు భారీ స్థాయిలో తవ్వకాలు మొదలుపెట్టారు. దీంతో ఆయాచోట్ల ఆక్వా చెరువులు నూతనంగా ఇబ్బడి ముబ్బడిగా తవ్వడంపై సమీప ప్రాంతల రైతాంగం తమ వరి పంటలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తమకు సరైన సమయంలో చెరువులు కారణంగా సాగునీరు సైతం అందడం లేదనిఅంటున్నారు.అలాగే భూసారం దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.దీంతో అనుమతులు కావాలంటే నిబంధనలు పాటించాలి అందుకే అనుమతులు లేకుండా దొడ్డిదారిన తవ్వకాలు మొదలయ్యాయి.దీనికి రెవిన్యూతోపాటు, రాజకీయ నాయకులు అండదండలు పుష్కలంగా ఉన్నాయి.వాస్తవానికి కొత్తగా చెరువులు తవ్వడానికి అనుమతులు లేనప్పటికీ ఇలా ఇష్టానుసారంగా చెరువులు తవ్వడంపై స్థానిక రెవెన్యూ యంత్రాంగంపై సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక్కడ ఇప్పటికే కూరాడ డ్రైయిన్ ఇరువైపులా వందలాది ఎకరాల ఆక్వా చెరువులు తవ్వి వినియోగంలో ఉన్నాయి. వీటిని ఆనుకుని మరిన్ని ఆక్వాచెరువలు తవ్వడం మొదలుపెట్టారు ఒక చోట అయితే సుమారు 80% బారీ చెరువు తవ్వి పూర్తిచేసిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆర్యావటం రెవెన్యూ పరిధిలో గొల్లపాలెం, పెద్దాపురపాడు ,ఆర్యావటం గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఇష్టానుసారంగా ఆక్వాచెరువులు ఇలా బహిరంగంగా ఆక్వా చెరువులు తవ్వేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం విశేషం. ఇక్కడ చెరువులు ఇష్టానుసారంగా తవ్వడంతో ఏళ్ల తరబడిఉన్న రహదారులు, పంట బోధులు సైతంమూసుకుపోతున్నాయని రైతులు పలువురు ఆరోపిస్తున్నారు . గత మూడు రోజుల నుంచి ఇక్కడినుండి కిందకు వెళ్లే రైతులు చెరువుల తవ్వుతున్న కారణంగా రహదారి మూసుకుపోవడంతో ఇబ్బందులుకు గురవుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ తవ్వుతున్న ఆక్వాచెరువలుకు ఏవిధమైన అనుమతులు లేనప్పటికీ తాము అనుమతులు తీసుకునే చెరువు తవ్వుతున్నామనడం స్థానిక రెవిన్యూ అధికారులు నిఘా ఏస్థాయిలో ఉందో చెప్పవచ్చు. ఇదే అదునుగా చుట్టుపక్కల మట్టి మాఫియా గ్యాంగ్ రాత్రులు ట్రాక్టర్లుతో యధేచ్ఛగా తరలించుంకు పోతున్నా పట్టించుకునే వారు లేకపోవడంతో వీరికి అడ్డు అదుపు లేకుండా పోయింది.ఇటీవల మతుకుమిల్లి గ్రామంలో సుమారు 180 సెంట్లు మెట్టు భూమిలో యదేచ్ఛగా మైనింగ్ తవ్వకాలం రాత్రి,పగలు తేడాలేకుండా ఇతర ప్రాంతాలకు తరలిపోయినా ఏవిధమైన చర్యలు చేపట్టకపోవడం అప్పట్లో సార్వత్రా విమర్శలు గుప్పించాయి . దీంతో ప్రభుత్వానికి సైతం లక్షలాది రూపాయలు దక్కకుండా పోయాయి.ఇంత ఇలా జరుగుతున్నా మైనింగ్ అదికారులు సైతం స్పందించకపోవడం విశేషం.చెరువులు తవ్వటానికి అనుమతులు లేవు. తాసిల్దార్ ఠాగూర్కాజులూరు మండల పరిధిలో ఎట్టి పరిస్థితిలోనూ నూతనంగా చెరువులు తవ్వడానికే ఎవరికి అనుమతులు లేవని కాజులూరు తాసిల్దార్ ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన కాజులూరు మండలం ఆర్యావటం రెవెన్యూ పరిధిలో ఇబ్బడి ముబ్బడిగా చెరువులు తవ్వుతున్న సమాచారం ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు.ఈసందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ ఎవరైనా చెరువులు తవ్వకాలు జరపాలనుకుంటే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా చెరువుల తవ్వడం గాని మట్టి తోలడం గాని మండల పరిధిలో ఎక్కడ జరిగినా నిబంధనలు మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు .అలాగే ఆర్యవటం రెవెన్యూ పరిధిలో ఇప్పటికే ఆప్రదేశానికి రెవిన్యూ ఇన్స్పెక్టర్, స్థానిక విఆర్ఓ,లను పంపించడం జరుగుతోందని చెప్పారు.అక్కడ తవ్వుతున్న చెరువుల విషయంలో తవ్వకాలు నిలుపుదల చేసి పైన్ వేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తాసిల్దార్ ఠాగూర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగివుండాలి






కోట ఏప్రిల్ 3 (శ్రీ చక్ర): పొదుపు మహిళా సభ్యులు అందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగివుండాలని వెలుగు ఏపీఎం అనీలా అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని వెలుగు కార్యాలయంలో వి ఓ ఏ లకు ఎస్ హెచ్ జి క్రెడిట్,లైవ్లీ హుడ్ విధానాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.అనంతరం వెలుగు ఏపీఎం అనీలా మాట్లాడుతూ పొదుపు సభ్యులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలుపై అవగాహన పెంచుకుని అభివృద్ధి మార్గంలో ఉండాలన్నారు.ఈ కార్యక్రమానికి వి ఓ ఏ లు,ఎన్యూమరేట్స్,సీసీ లు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ లు ప్రసాద్,భాస్కర్,శ్రీకాంత్, శంకరయ్య,అలివేలమ్మ,హిమ బిందు,వి ఓ ఏ లు పాల్గొన్నారు.

## 7 న బార్ అసోసియేషన్ ఎన్నికలు

### ఆరు పదవులకు ద్విముఖపోటి





రామచంద్రపురం, ఏప్రిల్ 3(శ్రీచక్ర)రామచంద్రసపురం బార్ అసోసియేషన్ నకు ఈనెల 7వ తేదిన ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు సిఇవో గా టిఎస్ఎస్చలపతి వ్యవహరించనున్నారు.ఒక సంవత్సరం పదవీ కా ల పరిమితిలో జరుగనున్న ఎన్నికల్లో ఆరు పదవులకు ద్విముఖపోటికి పలువురు అభ్యర్థులు తలపడనున్నారు.వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షపదవికి అడ్వకేట్లు మామిడిపల్లి వెంకట సుబ్బారావు,వుండవిల్లి గోపాలరావు పోటిలో ఉన్నారు.అలాగేఉపాధ్యక్ష పదవికి డి.సూర్య సుబ్రమణ్య శర్మ, గోవర్ధనం మల్లేశ్వర రావు లు,జనరల్ సెక్రటరీ పదవికిబొడ్డు వరాహ నరసింహ మూర్తి నీలం మధుసూధనరావులు,జాయింట్ సెక్రటరీ పదవికి ఎన్ వి వి శేష కుమార్,పివీఎస్ జానకి లుకోశాధికారి పదవికి చింతపల్లి శ్రీనివాసరావు, దొంతంశెట్టి ఓం ప్రకాష్,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి జె.ఎన్.ఎన్.చక్రవర్తి,నారాయణ రావులు పోటిలో తలపడనున్నారు.ఇదిఇలా ఉండగా లేడి రిప్రజెంటేటివ్ గాఎల్. పి .కే .కుమారిని ఏకగ్రీవంగా ప్రకటించారు.

## టేకు ప్లాంటేషన్ సందర్శించిన చీఫ్ కన్సర్వేటర్ ఫారెస్ట్ అధికారి





జీలుగుమిల్లి ఏప్రిల్ 3 (శ్రీ చక్ర) ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని గురువారం రమణక్కపేట గ్రామం లో గల టేకు ప్లాంటేషన్ ను ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి డాక్టర్ చలపతిరావు (ఐ ఫ్ స్) సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన నర్సరీలోని టేకు మొక్కలను మరియు ఎర్రచందనం మొక్కల పెంపకం అభివృద్ధి ని పరిశీలించారు . అనంతరం ప్లాంటేషన్ పరిసరాలలో ఉన్నటువంటి టేకు మొక్కలను మరియు వెదురు బొంగులు వాటి పరిరక్షణ వివరాలు అడిగి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు డి ఎఫ్ ఓ సుభాన్. సబ్ డి ఎఫ్ వెంకటసుబ్బయ్య. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గా కుమార్ బాబు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ధర్మారావు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మారిష్. మరియు లలిత కుమారి పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

హైదరాబాద్,ఏప్రిల్3(ఆర్ఎన్ఎ): హెచ్సీయూ భూముల విషయంలో సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని బిజెపి ఎంపి రఘునందన్ రావు అన్నారు. ఓవైపు విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్రావు తెలిపారు. హైదరాబాద్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు- కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది.

## రూ.859 కోట్ల రూపాయల దుర్వినియోగం

### రెండోరోజూ విచారణకు విజయకుమార్ రెడ్డి

గుంటూరు,ఏప్రిల్3 : ఏపీ సమాచార శాఖ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి వరుసగా రెండో రోజు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఏసీబీ ఇచ్చిన నోటీసుల మేరకు బుధవారం గుంటూరులోని ఏసీబీ రిజనల్ కార్యాలయానికి విచారణకు వచ్చారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారణ కొనసాగింది. అయితే నిన్నటి విచారణకు విజయ్కు మార్ రెడ్డి సహకరించలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో గురువారం మరోసారి విచారణకు పిలిచారు. ఉదయం 10:30 గంటల తర్వాత రెండో రోజు విచారణకు విజయ్ కుమార్ హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాచార శాఖ కమిషనర్గా పనిచేసి విజయ్ కుమార్ రెడ్డి.. మొత్తం రూ.859 కోట్ల రూపాయలను ప్రభుత్వ ప్రకటన రూపంలో ఖర్చు చేయగా.. వాటిలో 50 శాతం వరకు కేవలం సాక్షి పత్రిక, సాక్షి మీడియాకు మాత్రమే కేటాయించారు. అంతే కాకుండా మిగిలిన 50 శాతం కూడా అత్యధిక శాతం వైసీపీకి అనుకూలంగా పనిచేసే మీడియా సంస్థలకే కట్టబెట్టారు. ఈ కేసులోనే విజయ్కుమార్ను ఏసీబీ విచారిస్తోంది. 2019 - 24 మధ్యకాలంలో 859 కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసినట్టు- విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. అప్పటి ఐ అండ్ పీఆర్ సమాచార కమిషనర్ విజయ్ కుమార్ నోటీసులు ఇచ్చారు.ఎవరి ప్రోద్భలంతో చేశారు.. ఎందుకు చేశారు అనే దాన్ని ఏసీబీ కూపీ లాగుతోంది. ఈ వ్యవహారానికి సంబంధించి విజయ్ కుమార్ను కొన్ని ప్రశ్నలు అడుగగా.. ఆయన మౌనం దాల్చినట్లు తెలుస్తోంది. ఎలాంటి సమాధానం చెప్పకుండా ఉండటంతో గత ప్రభుత్వంలో సాక్షి మీడియాకు, వైసీపీ అనుకూల మీడియాకు ఇచ్చిన ప్రభుత్వ ప్రకటనల రికార్డులను కూడా ఆయన ముందు ఉంచి ప్రశ్నించారు. అయినప్పటికీ విజయ్ కుమార్ ఎలాంటి సమాధానాలు ఇవ్వనట్లు తెలుస్తోంది. దీంతో ఈరోజు మరోసారి విచారణకు రావాల్సిందిగా విజయ్ కుమార్కు ఏసీబీ అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఉదయం విచారణ నిమిత్తం ఏసీబీ ఆఫీసుకు వచ్చారు. ఎవరి ప్రోద్భలంతో, ఎవరు ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనాన్ని దాదాదత్తం చేశారని విజయ్ కుమార్ను ప్రశ్నించి.. ఆయన నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేయనున్నారు.

# జగన్ లో ఎంత మార్పో....



విజయవాడ, ఏప్రిల్ 3, అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తల్ని, స్థానిక నేతల్ని పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణ ఉంది. దానికి ఆయన ప్రవర్తనే ప్రత్యక్ష సాక్ష్యం. లోకల్ లీడర్స్ తో పెద్దగా కలిసేవారు కాదు జగన్, ఆ మాటకొస్తే మంత్రులకు కూడా అపాయింట్ మెంట్లు దక్కేవి కావు, ఇక ఎమ్మెల్యేల సంగతి సరేసరి. జగన్ అపాయింట్ మెంట్ దొరకాలంటే ఎమ్మెల్యేలు రోజుల తరబడి తాడేపల్లి ప్యాలెస్ ముందు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు జగన్ అధికారం కోల్పోయాక పరిస్థితిలో మెల్ల మెల్లగా మార్పులొస్తున్నాయి. జగన్ కోటరీ ఒక్కొక్కరే దూరం జరిగారు. అధికారంలో ఉన్నప్పుడు గొంతు చించుకున్నవారు కూడా సైలెంట్ అయ్యారు. చివరకు మిగిలింది కార్యకర్తలు, స్థానిక నాయకులే. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీకి లాయల్ గా ఉన్నవారు వైసీపీ పరువు కాపాడారు. అందుకే వారికి రేపు తాడేపల్లిలో ప్రత్యేకంగా అపాయింట్ మెంట్ ఇచ్చారు జగన్.రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎంపీపీ, జడ్పీ ఉప ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని తప్పించుకుంది. గతంలో ఆయా సీట్లన్నీ వైసీపీకి చెందినవే. అయితే వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా, వైసీపీకి కాస్త అనుకూలంగా ఫలితాలొచ్చాయి. దీంతో జగన్ కి తత్వం బోధపడింది. తాను ఇన్నాళ్లూ దూరం పెట్టిన కార్యకర్తలు, స్థానిక నేతలే తనను వదిలిపెట్టలేదని అర్థమైంది. అధికారంలో ఉన్నప్పుడు తన చుట్టూ కోటరీగా తిరిగిన వాళ్లు, రాజ్యసభ స్థానాలు, ఎమ్మెల్సీలు తీసుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారనే విషయం స్పష్టమైంది. దీంతో జగన్ లో మార్పు మొదలైంది. కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అంటూ ఆమధ్య ట్వీట్ వేసిన ఆయన, తాజాగా స్థానిక నాయకులతో ప్రత్యేకంగా మీటింగ్ పెట్టారు. పార్టీ విజయానికి సహకరించిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలను స్వయంగా కలుస్తానని కబురు పంపించారు జగన్. వారందర్నీ తాడేపల్లికి పిలిపిస్తున్నారు.వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశానికి అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాలకు సంబంధించి 8 నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు హాజరవుతారు. వీరందరికీ జగన్ ప్రత్యేకంగా సమయం కేటాయిస్తారట. అందరితో మాట్లాడి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అడిగి తెలుసుకుంటారట.జగన్ లో మార్పు మొదలవడం మంచిదే, కానీ ఈ మార్పు సరిపోదు. అప్పట్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ని పొరుగు రాష్ట్రం నేతలంటూ ఎగతాళి చేసిన జగన్.. అధికారం పోయాక తాను బెంగళూరులో ఎందుకు తలదాచుకుంటున్నారో చెప్పాల్సి ఉంది. కానీ జగన్ ఇప్పిప్పుడు అసలైన పొటికల్ టూరిస్ట్ లా మారిపోయారని సోషల్ మీడియాలో కౌంటర్లు పడుతున్నాయి. ఎప్పుడో ఎక్కడో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే మాత్రం పరామర్శలకు వస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. కానీ ఈసారి లోకల్ లీడర్స్ కోసం బెంగళూరు నుంచి జగన్ వస్తున్నారు. ఇది మెచ్చుకోవాల్సిన విషయమే. కానీ ఈ మార్పు సరిపోదు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన కళ్లకు గంతలు కట్టి ఆడించింది కోటరీయేనని ఆ పార్టీ నేతలు కొందరు బలంగా నమ్ముతున్నారు. ఆ గంతలు ఆయన విప్పుకోవాలి. ప్రజల మధ్యకు వచ్చినప్పుడే ఏదైనా ఫలితం ఉంటుంది. అది కూడా కూటమి చేసే తప్పుల్ని బట్టే ప్రజలు జగన్ దగ్గరకు చేరతారనే విషయాన్ని మరింతగా అర్థం చేసుకోవాలి. పాలనలో కూటమి సక్సెస్ అయితే నాలుగేళ్ల తర్వాత కూడా ప్రజలకు జగన్ అవసరం ఉండదు.

## సినిమాల్లోకి దువ్వాడ...

శ్రీకాకుళం, ఏప్రిల్ 3 దువ్వాడ శ్రీనివాస్–మాధురి.. ఏ తెలుగు న్యూస్ ఛానెల్ చూసినా, యూట్యూబ్ ఛానెల్ చూసినా వీరిద్దరి సందడి అంతా ఇంతా కాదు. మాధురి ఎపిసోడ్ కి టాప్ రేటింగ్స్ రావడంతో అప్పట్నుంచి ఆమెను మీడియా నీడలా అనుసరిస్తోంది. మాధురిని ఆకాశానికెత్తేయడం, ఆమెను హీరోయిన్ లా ఉన్నారని అనడం, అందులోనూ నగ్మాతో పోల్చడం.. ఆమెతో క్యాట్ వాక్ చేయించడం, పాటలు పాడించడం, డ్యాన్స్ చేయించడం.. అబ్బో ఇలాంటి సీన్స్ ఇంటర్వ్యూల్లో చాలానే ఉన్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా ఎంట్రీ విషయంపై మరోసారి క్లారిటీ ఇచ్చారు మాధురి.మాధురికి చాలా క్వాలిఫికేషన్లు ఉన్నాయని పొలిటీషియన్, వుమన్ ఎంటర్ ప్రెన్యూర్, ఇన్ ఫ్లూయెన్సర్, ఫైర్ బ్రాండ్.. ఇలా చాలా ఉన్నాయని, సినిమా హీరోయిన్ కూడా అందులో యాడ్ అవుతోందని యాంకర్ ఆమెను పొగడ్తల్లో ముంచెత్తారు. మాధురి కూడా తనకు చిన్నప్పటినుంచి యాక్టింగ్ అంటే ఆసక్తి ఉందని చెప్పుకొచ్చారు. అంతే కాదు, గతంలో తనకు టైమ్ దొరకలేదని, ఛాన్స్ దొరకలేదని.. టైమ్ వచ్చినప్పుడు అది కూడా జరుగుతుందని చెప్పుకొచ్చారు మాధురి.మాధురి తనకు సినిమాల్లోకి వెళ్లాలనుంది అని అనగానే, పక్కనే ఉన్న దువ్వాడ శ్రీనివాస్ ఊరుకుంటారా..? ఆయన కూడా మాధురి టాలెంట్ ని బయటపెట్టారు. పాటలు పాడటం కంటే కంటే ఆమె డ్యాన్స్ బాగా చేస్తుందని చెప్పుకొచ్చారు. భరతనాట్యంలో ఆమెకు ప్రవేశం ఉందన్నారు. నెమలికి నేర్పిన నడకలివీ అనే పాటతోపాటు, చాలా పాటలకు ఆమె అద్భుతమైన పర్ఫామెన్స్ ఇస్తుందన్నారు. గతంలో దువ్వాడ కూడా మాధురిని అడిగి మరీ కొన్ని పాటలకు డ్యాన్స్ వేయించుకునేవారట.దువ్వాడ శ్రీనివాస్ తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే ఇష్టమని, ఆయనే తనకు రోల్ మోడల్ అని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆయన సినిమాల్ని తాను చూస్తుంటానని, హోమ్ థియేటర్లో ఆయన సినిమాలు చూస్తానన్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు తాను థియేటర్లకు వెళ్తుంటానన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ని కూడా తాను అభిమానిస్తానని, అయితే తాను సీనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్ అని చెప్పుకొచ్చారు దువ్వాడ. కార్ లో సీనియర్ ఎన్టీఆర్ పాటలు పెట్టుకుంటారని, అప్పుడప్పుడు ఆ పాటలకు అర్థాలు తనకు చెబుతుంటారని కోరస్ ఇచ్చారు మాధురి.శ్రీనివాస్ కి కూడా సినిమాలంటే బాగా ఇష్టం. ఆమధ్య మాధురి నిర్మాతగా ఆయన ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించినట్టు వార్తలొచ్చాయి. నటించిన వీడియోలు కూడా బయటకొచ్చాయి. ఇక మాధురి కూడా తన యాక్టింగ్ పెర్ఫామెన్స్ ని వెండితెరపై చూపించాలనుకుంటున్నారు. ఫైనల్ గా వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా నటించే అవకాశం ఉందేమోనని అనిపిస్తోంది. దువ్వాడ–మాధురి కాంబినేషన్ ఇప్పటికే బుల్లితెరపై, యూట్యూబ్ లో సూపర్ హిట్ అయింది. వీరి ప్రోగ్రామ్ లకు మంచి ప్రేక్షకాదరణ ఉంది. ఇక వీరు సినీరంగంలోకి వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. షార్ట్ ఫిల్మ్ ల వరకు ఓకే, వెండితెరపై కనపడాలంటే అది కాస్త ఖర్చుతో కూడుకున్న పని, దానికి దువ్వాడ సిద్ధపడతారా..? మాధురి తెరంగేట్రానికి తానే నిర్మాత అవుతారా..? వేచి చూడాలి.

## ఎస్వీ యూనివర్సిటీ పీఎస్ ను పరిశీలించిన ఎస్పీ

తిరుపతి,ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషను జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిటిషన్ లపై ఎలా స్పందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిటిషన్స్ విచారించడంలో జాప్యం చేయవద్దన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిటిషన్ పై విచారించి త్వరితిగతిన న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషను లోని వివిధ కేసులు సంబంధించి వాటి స్టేటస్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో అన్ని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనిఅడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధులు నిమిత్తం ఎక్కడకు వెళ్ళిన వారికి తప్పనిసరిగా డ్యూటీ పాస్ పోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కే రవి మనోహర్ ఆచారి అదనపు ఎస్పీ శాంతి భద్రతలు, లత డిఎస్పి మహిళ మరియు తిరుపతి టౌన్, సుబ్రహ్మణ్యం సి. ఐ.డి.సి.ఆర్. బి, సాధిక్ అలి సీ.ఐ. స్పెషల్ బ్రాంచ్ రామయ్య సిఐ ఎస్వీయు పి.ఎస్. మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 4, 5 తేదీల్లో పిఠాపురంలో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన

పిఠాపురం,శాసన మండలి సభ్యుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు ఈ నెల 4, 5 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు. పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతన నిర్మాణాలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్, పిఠాపురం ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాస్ హాజరు అవుతారు.

## సోషల్ మీడియాలో ప్రచారానికి హద్దే లేదా

రాజమండ్రి, ఏప్రిల్ 3,నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుంది ప్రస్తుత రాజకీయాలు. సోషల్ మీడియా జనరేషన్‌లో పాలిటిక్స్ మరింత దారుణంగా ఉంటున్నాయి. పాస్టర్ ప్రవీణ్ పగడాల డెత్ కేసులో ఎంత రచ్చ జరిగిందో అంతా చూస్తున్నారు. సీసీఫుటేజ్‌లో చిన్న అనుమానం కూడా లేదు. ప్రవీణ్ ఒంటిపై దాడి జరిగిన ఆనవాళ్లు కూడా లేవు. కత్తి పోట్లు, దెబ్బలు, విష ప్రయోగం.. గట్రా ఎలాంటి డౌట్ లేదు. కానీ, చంపేశారు.. చంపేశారు.. అంటూ సోషల్ మీడియాలో విష ప్రచారం చేశారు. సొసైటీలో మత చిచ్చు రగిల్చే ప్రయత్నం చేశారు కొందరు.ఈ తరహా ప్రచారం వెనుక ఓ పార్టీ ప్రోద్బలం ఉందనే ఆరోపణ ఉంది. ఆ పార్టీ అనుకూల వర్గీయుల నుంచే ఎక్కువగా రెచ్చగొట్టే పోస్టులు, కామెంట్లు వచ్చాయని పోలీసులు గుర్తించారు. వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకూ సిద్ధమవుతున్నారు.చనిపోయింది పాస్టర్ కాబట్టి.. ఎలా చనిపోయారో తెలీటం లేదు కాబట్టి.. చంపేశారు అంటే సరిపోతుందా? సున్నితమైన అంశం కావడం తమకు కలిసి వస్తుందని అనుకుంటున్నారా? కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు ఇంతలా రెచ్చగొట్టాలా? మతం రంగు పులిమేసి.. జనాల్లో విద్వేషాన్ని రగిలిచ్చి ఏం చేయాలనుకున్నారు? ఆ వేడిలో రాజకీయ పబ్బం గడుపుకునే వ్యూహం పన్నారా? మరీ, ఇంతటి ప్రమాదకరమైన క్రీడ ఆడటం కరెక్టేనా?హైదరాబాద్ నుంచి కొవ్వూరు వరకు.. దారి పొడవునా గంటల తరబడి సీసీకెమెరా ఫుటేజ్ దొరికింది కాబట్టి సరిపోయింది. లేదంటే పోలీసులు చెప్పిన విషయాల్ని అంత ఈజీగా ఎవరైనా నమ్మేవాళ్లా? పాస్టర్ ప్రవీణ్ పగడాల విజయవాడ చేరుకోవడం.. అక్కడ పార్కులో సేద తీరడం.. అప్పటికే ఆయన బుల్లెట్ బండి హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం.. చాలా నీరసించి ఉండటం.. ఆ తర్వాత దారి మధ్యలో లిక్కర్ కొనడం.. ఇలా మినిట్ టు మినిట్ కంప్లీట్ సీసీఫుటేజ్ బయటపెట్టారు ఏపీ పోలీసులు. అవన్నీ చూశాక కానీ.. ప్రవీణ్‌ది హత్య కాకపోవచ్చు.. యాక్సిడెంటో, అస్వస్థత వల్లో చనిపోయి ఉండొచ్చు అని ప్రజలు ఇప్పుడిప్పుడే ఓ అంచనాకు వస్తున్నారు. ఒకవేళ ఆ సీసీకెమెరా దృశ్యాలు లభించి ఉండకపోయి ఉంటే..? ప్రవీణ్‌ను చంపేశారని ప్రజలకు ఫిక్స్ చేసేవారే కదా? సోషల్ మీడియా రచ్చ ఇప్పట్లో ఆగి ఉండేదా? క్రిష్టియన్లకు మిగతా వర్గాలకు మధ్య చిచ్చు పెడితే.. రాష్ట్రం మతాల వారిగా విడిపోతే.. అది అందరికీ నష్టమే కానీ ఎవరికీ లాభం కాదు. చివరికి ఆ పార్టీకి కూడా. అందరికీ అన్ని వర్గాల మద్దతు కావాల్సిందేగా. ఇంత చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారు?ఇప్పుడే కాదు గతంలోనూ ఇలాంటి డైవర్ట్ పాలిటిక్స్ చూశాం. వివేకానందరెడ్డిని గొడ్డలితో అతి దారుణంగా తల నరికి చంపారు. ఆయన డెడ్‌బాడీ రక్తపు మడుగులో పడి ఉంది. ఆ స్పాట్ చూస్తే చిన్నపిల్లాడైనా చెప్పేస్తాడు అది హత్య అని. కానీ, గుండెపోటు అని ప్రకటించి చావు తెలివితేటలు చూపించారు కొందరు. అలా కొన్నిగంటల సేపు మాత్రమే బుకాయించ గలిగారు. నిజం బయటకు రాకుండా సమాధి చేయలేక పోయారు. ఆ కేసుతో సంబంధం ఉన్న వాళ్లంతా ఇటీవల వరుసగా చనిపోతుండటం.. హత్యా రాజకీయాలు ఇంకా ఆపలేదనే అనుమానాన్ని బలపరుస్తోంది. వివేక కేసులో హత్యను గుండెపోటుగా చిత్రీకరిస్తే.. పాస్టర్ ప్రవీణ్ పగడాల లాంటి సెన్సిటివ్ కేసులో మర్డర్ ముసుగు వేసే ప్రయత్నం పక్కా ప్లాన్డ్‌గా జరిగిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. అదే నిజమని తేలితే సీరియస్ యాక్షన్ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## విజయనగరంలో వైసీపీ ఖాళీ...?

విజయనగరం, ఏప్రిల్ 3,ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ మరింత పుంజుకుంటోందా? అంటే అవుననే తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలలోపు వైసీపీ పూర్తిగా ఖాళీ కాబోతుందా? అంటే కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది.కురుపాం నుంచి ఎస్ కోట నియోజకవర్గం వరకూ ఎక్కడ చూసినా రాజకీయ వలసలు షరా మాములుగా మారిపోయాయి. మరీ ముఖ్యంగా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డానికి కష్టించి పని చేసిన హార్డ్ కోర్ ఫ్యాన్ పార్టీ ఫ్యాన్స్ కూడా ఇప్పుడు సైకిల్ బెల్లు కొట్టడానికి రెడీ అంటే రెడీ అంటున్నారట.ఒక్కో ఏరియాలో ఫలానా కావాలన్న షరతులు పెట్టకుండానే ఫ్యాన్ వదిలి సైకిలెక్కుతున్నారట. దీనంతటికీ కారణమేంటని చూస్తే.. అందరి నుంచి దాదాపు ఒకటే మాట వినిపిస్తోందట. ఇన్నాళ్ల పాటు రెక్కలు ముక్కలు చేసుకుని పార్టీని అధికారంలోకి తెస్తే.. తమకు మిగిలింది ఏదీ లేదని వీరంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఆ మాటకొస్తే ఫ్యాను రెక్కలు ముక్కలయ్యాయి.. మీ కంటికి కనిపించడం లేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారట. ఇన్నాళ్ల పాటు జగన్ని నమ్ముకున్నందుకు తాము నట్టేట మునిగామనీ అంటున్నారట. ఆ పార్టీలాగే తమ జీవితాలు కూడా అలాగే ఛిన్నాభిన్నమై పోయిందనీ వీరంతా గుర్రుగా ఉన్నారట. దీంతో టీడీపీ, జనసేనకు జై కొడుతున్నారట.మరీ ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాల్టీల్లో అయితే అవిశ్వాసానికి సైతం సిద్ధమయ్యారంటే ఫ్యాను పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో ఇప్పటికే ఒక తిరుగుబాటు మొదలైందట. అవిశ్వాస తీర్మానం పెట్టడమే ఆలస్యమట.స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఫోన్ చేసి బుజ్జగించినా కుదరదని తెగేసి చెబుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. గతంలో ఒక పార్టీ నుంచి మరొక పార్టీలో చేరాలంటే ఆయా ప్రాంతాల్లో పట్టున్న నాయకులతో రాయబారం నడిపించాలి. అదే ఇప్పుడు ఇందుకు రివర్స్ లో ఉందట వ్యవహారం. ఎవరూ ఏమీ అడక్కుండానే.. మేమే వచ్చేస్తున్నాం.. వద్దనకండి ప్లీజ్ అంటూ సైకిల్ బెల్ వారంతట వారే మోగిస్తున్నారట. చోటా మోటా నాయక గణం తమంత తాముగా వెళ్లి.. కూటమి పార్టీల కండువాలు కప్పేసుకుంటున్నారట.ఇక నెల్లిమర్ల నియోజకవర్గంలో అయితే వైసీపీని ఎప్పుడు ఖాళీ చేద్దామా? అన్నట్టుందట ఇక్కడి జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి జోరు. వారానికి కనీసం రెండు మూడు గ్రామాల వైసీపీ కార్యకర్తలను తమ గ్లాసు పార్టీలో చేర్పించందే నిద్రపోవడం లేదట ఎమ్మెల్యే మాధవి. భవిష్యత్తులో తమకు పదవులు వచ్చినా రాకపోయినా.. వైసీపీ అనేది ఉండకూడదు. ఎటు నుంచి ఎటు చూసినా జనసేన మాత్రమే కనిపించాలన్నంత కసితో పని చేస్తున్నారట ఈ మహిళా ఎమ్మెల్యే.అయితే జిల్లా కేంద్రంలో పరిస్థితి కాస్త భిన్నంగా ఉందంటున్నారు. కోరి వస్తామన్నా చేద్దాం–చూద్దాం అంటూ దాట వేస్తున్నారట ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు. వైసీపీలో అవినీతి మరక అంటని వారిని మాత్రమే తీసుకుంటున్నారట. ఇప్పటికే వైసీపీకి చెందిన కార్పొరేటర్లు వస్తామనీ.. కార్పొరేషన్ను టీడీపీ పరం చేస్తామని బంపరాఫర్లు ప్రకటిస్తున్నా.. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు వద్దంటే వద్దంటున్నారట. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎవరికి అధికారం ఇస్తే.. వారే పరిపాలించాలని హితబోధ చేస్తున్నారట. అందులోనూ ఎవరిని పడితే వారిని పార్టీలోకి తీసుకుంటే నష్టం తమకేనని.. వారిస్తున్నారట. దీంతో తండ్రి మాట జవదాటలేక మున్సిపల్ ఎన్నికలు వచ్చే వరకూ వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారటు ఎమ్మెల్యే.ఇక ఎస్ కోట, చీపురుపల్లి, సాలూరు, గజపతినగరం, కురుపాం నియోజకవర్గాలలో చేరికల పరంపర ఒక రేంజిలో కొనసాగుతోందట. రోజుకో నియోజకవర్గంలో భారీ స్థాయిలో చేరికలు కనిపిస్తున్నాయట. గ్రామాలకు గ్రామాలు సైకిల్ కి సై అంటున్నాయట. దీంతో వైసీపీ లీడర్లు బయటకు రావడానికే తటపటాయించాల్సి వస్తోందట.

## బొత్సపై జనసేన ప్రత్యేక దృష్టి



విజయవాడ, ఏప్రిల్ 3 ఏపీలో ( రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఆ పార్టీకి కీలక నేతలు గుడ్ బై చెబుతూ వచ్చారు. పార్టీలో నెంబర్ 2 స్థాయి కలిగిన నేతలు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడారు. గత ఐదేళ్లపాటు పదవులతో పాటు ఆ పార్టీలో గౌరవం పొందిన నేతలు సైతం ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పటికే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీకి రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యులతో పాటు ఎమ్మెల్సీలు సైతం పదవులను వదులుకున్నారు. విజయసాయిరెడ్డి లాంటి నేత వైసిపికి గుడ్ బై చెప్పడం ఆందోళన కలిగించే అంశమే. అయితే ఇప్పుడు తాజాగా బొత్స సత్యనారాయణ పై సైతం అనుమానపు చూపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.వాస్తవానికి బొత్స సత్యనారాయణ పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతుంది. అందుకు అనుగుణంగా బొత్స పవన్ కళ్యాణ్ ను ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భిన్నంగా బొత్స వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణాల్లో ఎదురుపడినప్పుడు ఆప్యాయ పలకరింతలు, ఆ లింగనాలు చేసుకుంటున్నారు. దీంతో ఏదో జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయి. అయితే తాజాగా పవన్ కళ్యాణ్ సైతం బొత్స విషయంలో పార్టీ శ్రేణులకు చర్చలు జరిపినట్లు ప్రచారం సాగుతోంది. బొత్సను పార్టీలోకి తెస్తే ఎలా ఉంటుంది అని పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించినట్లు సమాచారం. అయితే జనసేన నాయకుల నుంచి సానుకూలత రావడంతో పవన్ నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. కొందరు అరెస్టులు కూడా అయ్యారు. కానీ బొత్స విషయంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేశారు బొత్స. కానీ ఎన్నడు రివేంజ్ రాజకీయాలు నడపలేదన్నది ఆయనపై ఉన్న మంచి ముద్ర. అందుకే కూటమి ప్రభుత్వంలో సైతం ఆయనకు సరైన గౌరవం దక్కుతోంది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ శాసనమండలిపక్ష నేతగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. పార్టీ తరఫున గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. అటువంటి నేతను జనసేనలోకి తెచ్చుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీయవచ్చని పవన్ భావిస్తున్నారట. ఉత్తరాంధ్రలో పట్టున్న నాయకుడు బొత్స. విజయనగరం జిల్లాలో అయితే నాలుగు నియోజకవర్గాలు ఆయన కుటుంబ సభ్యుల చేతిలో ఉంటాయి. మిగతా నియోజకవర్గంలో సైతం ప్రభావం చూపగలరు. ఉత్తరాంధ్రలో బలమైన తూర్పు కాపు సామాజిక వర్గంలో పట్టున్న నేత. అందుకే ఆయనను జనసేనలోకి రప్పించుకుంటే పార్టీ బలోపేతం అవుతుందని పవన్ భావిస్తున్నారట. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## నేడు ప్రపంచ ఎలుకల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

వినాయకుడి వాహనం. అయితేనేం.. ఇంట్లో అది చేసే అల్లరికి దాన్ని చూస్తేనే.. అంతెత్తున లేస్తారు. తిట్ల దండకం మొదలుపెడతారు. ఇక పిల్లి దాన్ని చూసిందంటే చాలు.. దాని అంతుచూసే దాకా వదలదు. మనుషులను ముప్పుతిప్పలు పెడుతున్నా.. 'మూషిక' మహారాజులను ప్రేమించే వారు , పూజించే వాళ్లు ఉన్నారు. ఇంతకీ ఏంటీ ఎలుక గోల అంటారా? ఈ రోజు ప్రపంచ ఎలుకల దినోత్సవం...ప్రపంచంలో ప్రతిరోజు ఏదో ఓ మూల.. ఓ దినోత్సవం జరుగుతూనే ఉంటుంది. కానీ అందులో కొన్ని మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంటాయి. ఈ 'వరల్డ్ ర్యాట్ డే' ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతోంది. జంతుప్రేమికులతో పాటు, ఎలుకలను అల్లారుముద్దుగా పెంచుకునే వాళు ర్యాట్ డే (ఏప్రిల్ 4)ను ఆనందంగా జరుపుకుంటున్నారు. ఎలుకల్లో అందంగా కనిపించే పప్పీ ర్యాట్స్‌కు ఎంతోమంది అభిమానులున్నారు. మనదేశంలో కాదు కానీ విదేశాల్లో వాటిని పెట్స్‌గా పెంచుకునే వాళ్ల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.రాజస్థాన్‌లోని దెష్నాక్‌లో ఉన్న కర్ణిమాత ఆలయంలో ఎలుకలను ప్రత్యేకంగా పూజిస్తారు. వాటికి ఇక్కడ మొక్కులు తీర్చడం విశేషం. ఈ గుడిలో ఎటు చూసినా వేలాది ఎలుకలు కనిపిస్తాయి. ఈ గుడికి వచ్చే భక్తులు వాటిని అమ్మవారి పిల్లలుగా భావించి ఎంతో భక్తితో పూజిస్తారు. ర్యాట్ లవర్స్.. తమ తమ పెంపుడు ఎలుకలను అందంగా ముస్తాబు చేస్తారు. వాటిని ఉంచే బోనులను కూడా అలంకరిస్తారు. ఎలుకలకు ఇష్టమైన ఆహారాన్ని ప్రిపేర్ చేస్తారు. ఇక ఎలుక ప్రేమికులంతా ఓ చోట కలుస్తారు. తమ ఎలుకలు చేసే అల్లరి గురించి ముచ్చటించుకుంటారు. కానుకలు ఇచ్చిపుచ్చుకుంటారు. సోషల్ వెబ్‌సైట్లో ర్యాట్ డే సెలబ్రేషన్స్ ఫొటోలను, అనుభూతులను తమ మిత్రులతో పంచుకుంటారు.పద ప్రయోగం:ఎలుక తోక తెచ్చి ఎన్నినాళు ఉతికినా.. నలుపు నలుపే కానీ.. తెలుపు కదు.సామెతలుపిల్లికి ఎలుక సాక్ష్యమటపిల్లి గుడ్డిదైతే.. ఎలుక ఎక్కిరించిదట.రక్షక ర్యాట్స్‌వినాయకుడే కాదు.. తన వాహనమైన ఎలుక కూడా కాంబోడియా ప్రజల విఘ్నాలను తొలగిస్తుంది. కాంబోడియా నుంచి టాంజానియా వరకు అనేక చోట్ల మందుపాతర్లు ఉన్నాయి. కంబోడియన్ మైన్ యాక్షన్ సెంటర్ మందుపాతర్లను కనిపెట్టే పనిని మూషిక రాజుకు అప్పగించింది. ఈ రాక్షస ఎలుకలు(గెయింట్ ర్యాట్స్) వాసన చూసి మందుపాతర్లను కనిపెట్టడంలో దిట్ట. వీటికి తెలివి కూడా ఎక్కువే..టాంజానియాలోని అపొపొ అనే ఒక ఎన్‌జీవో సంస్థ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. శిక్షణ తీసుకున్న ఎలుకల్ని మందుపాతర్లు ఉన్న ప్రదేశంలో విడిచి పెడతారు.



# స్పోర్ట్స్ న్యూస్

## ఐపీఎల్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి పంజాబ్ కింగ్స్.. మూడో స్థానానికి బెంగళూరు..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ కొనసాగుతున్నది. ప్లే ఆఫ్స్ పోరాటం ఆసక్తికరంగా మారుతోంది. నిన్నటి వరకు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రాయల్ చాలెంజర్స్ జట్టు సొంత మైదానంలో గుజరాత్ టైటాన్స్ చేతిలో పరాజయం పాలైంది. దాంతో పాయింట్ల పట్టికలో ఆర్‌సీబీ రెండో స్థానాలు దిగజారి మూడోస్థానానికి చేరుకుంది. ఇక గుజరాత్ నాలుగో ప్లేస్‌కి చేరుకుంది. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రమే ఇప్పటి వరకు రెండుమ్యాచుల్లో ఓటములు లేకుండా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నాయి. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ–జీటీ మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోయింది.దాంతో అగ్రస్థానం నుంచి మూడో ప్లేస్‌కి చేరుకుంది. ఇప్పటి వరకు మూడు మ్యాచులు ఆడిన ఆర్‌సీబీ రెండు విజయాలతో నాలుగు పాయింట్లు ఉండగా.. రన్ రేట్ +1.149తో మూడో ప్లేస్లో నిలిచింది. గుజరాత్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు నమోదు చేసి.. నాలుగు పాయింట్లు, +0.807 రన్ రేట్ ఉన్నది. ఇక పంజాబ్ కింగ్స్ ఆడిన రెండు మ్యాచుల్లో రెండు విజయాలతో ఆ జట్టు ఖాతాలు నాలుగు పాయింట్లు ఉండగా.. +1.485 రన్ రేట్ ఉన్నది. ఢిల్లీ క్యాపిటల్స్ నాలుగు పాయింట్లు ఆ జట్టు ఖాతాలో ఉండగా.. +1.320 రన్‌రేట్‌తో రెండోస్థానంలో ఉన్నది.ఏప్రిల్ 2 వరకు జరిగిన మ్యాచుల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ బ్యాట్స్‌మెన్ నికోలస్ పూరన్ ఆరెంజ్ క్యాప్ రేసులో ముందున్నాడు. మూడు మ్యాచుల్లో 219.76 స్ట్రయిక్ రేట్‌తో 189 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు 17 ఫోర్లు, 15 సిక్సర్లు బాదాడు. అత్యధిక వ్యక్తిగత స్కోరు 75. ఆ తర్వాతి స్థానంలో గుజరాత్ బ్యాట్స్‌మెన్ సాయి సుదర్శన్ నిలిచాడు. మూడు ఇన్నింగ్స్‌లో కలిపి 62 సగటు, 157.63 స్ట్రయిక్ రేట్‌తో 186 పరుగులు చేశాడు. ఉత్తమ బ్యాటింగ్ గణాంకాలు 41 బంతుల్లో 74 పరుగులు. ఆ తర్వాత గుజరాత్ బ్యాట్స్‌మెన్ జోస్ బట్లర్ మూడోస్థానానికి చేరాడు. మూడు ఇన్నింగ్స్‌లో 83 సగటు, 172.92 స్ట్రయిక్ రేట్‌తో 166 పరుగులు చేశాడు. ఇక పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ నాలుగో స్థానంలో ఉన్నాడు. రెండు మ్యాచ్‌ల్లో 149 పరుగులు చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 97 నాటౌట్.చెన్నై సూపర్ కింగ్స్ స్పిన్నర్ నూర్ అహ్మద్ ప్రస్తుతం పర్పుల్ క్యాప్ రేసులో ముందున్నాడు. నూర్ అద్భుతంగా బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. రెండవ స్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఉన్నాడు. రెండు మ్యాచుల్లో ఎనిమిది వికెట్లు తీశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో స్టార్క్ ఐదు వికెట్లు తీసిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు చెందిన జోష్ హాజిల్‌వుడ్, గుజరాత్ టైటాన్స్‌కు చెందిన ఆర్ సాయి కిశోర్, సీఎస్‌కెకు చెందిన ఖలీల్ అహ్మద్, లక్నోకు చెందిన శార్దూల్ ఠాకూర్ ఉన్నారు. ఈ నలుగురూ చెరో ఆరు వికెట్లు పడగొట్టారు.

## ఏపీకి రండి.. సన్‌రైజర్స్ జట్టుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆఫర్

కాంప్లిమెంటరీ పాసుల వ్యవహారంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఓ ఆఫర్ ఇచ్చింది.హెచ్‌సీఏతో నెలకొన్ని వివాదం నేపథ్యంలో తమ రాష్ట్రానికి రావాలని ఆహ్వానించింది. ఈ సీజన్‌లోని మిగతా మ్యాచ్‌లను వైజాగ్‌వేదికగా నిర్వహించాలని కోరింది. పన్ను మినహాయింపులు కూడా ఇస్తామని, అద్దె కూడా తీసుకోబోమని, ఇతర సహకారాలు కూడా అందిస్తామని తెలిపింది. సన్‌రైజర్స్ జట్టు నుంచి సమాధానం కోసం ఎదురుచూస్తున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది.అదనపు కాంప్లిమెంటరీ పాసుల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తమను బెదిరిస్తున్నదని, ఈ విషయంలో బీసీసీఐ తక్షణమే జోక్యం చేసుకోకుంటే తాము హైదరాబాద్‌ను వదిలివెళ్తామని సన్‌రైజర్స్ విడుదల చేసిన ఈ–మెయిల్ తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ విషయంపై హెచ్‌సీఏ కూడా స్పందించింది. అసలు తమకు ఎస్ఆర్‌హెచ్ నుంచి ఎలాంటి ఈ–మెయిల్ రాలేదని ఓ ప్రకటన విడుదల చేసింది. కార్పొరేట్ బాక్సుల టికెట్ల విషయంలో మొదలైన రగడపై అటు ఎస్ఆర్‌హెచ్, ఇటు హెచ్‌సీఏ ఢీ అంటే ఢీ అనుకుంటున్నాయి. ఒప్పందం ప్రకారం ఉప్పల్ స్టేడియంలోని మొత్తం సీటింగ్ కెపాసిటీలో 10 శాతం (3,900 సీట్లు) హెచ్‌సీఏకు సన్‌రైజర్స్ ఇవ్వాల్సి ఉంది.ఇక తాజా వివాదం నేపథ్యంలో హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవ్‌రాజ్ సమక్షంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్ పాల్గొని చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా.. బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ ట్రైపార్టీ ఒప్పందాన్ని కచ్చితంగా పాటించాలని, ఆ మేరకు స్టేడియం సామర్థ్యంలోని అన్ని విభాగాల్లో 10 శాతం కాంప్లిమెంటరీ పాసులను కేటాయించాలని హెచ్‌సీఏ ప్రతిపాదించగా దానికి ఎస్ఆర్‌హెచ్ అంగీకారం తెలిపింది. ఉప్పల్‌లో జరుగబోయే ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ హామీ ఇచ్చింది. చర్చల అనంతరం వివాదం ముగిసిందని ఇరు వర్గాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అయితే, ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్‌కు ఏసీఏ నుంచి ఆఫర్ రావడం గమనార్హం.




## సిరాజ్‌కు ఎక్కడో కాలింది: వీరేంద్ర సెహ్వాగ్

గుజరాత్ టైటాన్స్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌పై టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో సిరాజ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడని కొనియాడాడు. భారత సెలెక్టర్లతో పాటు ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్‌పై సిరాజ్ తన ఆటతోనే ప్రతీకారం తీర్చుకున్నాడని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఆర్‌సీబీతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సిరాజ్(3/19) మూడు వికెట్లతో గుజరాత్ టైటాన్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై నిప్పులు చెరిగాడు. పవర్ ప్లేలోనే ఆర్‌సీబీని దెబ్బతీసాడు. 7 ఏళ్ల పాటు సిరాజ్ ఆర్‌సీబీకి ప్రాతినిథ్యం వహించిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2025 సీజన్ మెగా వేలానికి ముందు సిరాజ్‌ను ఆర్‌సీబీ వదిలేయగా.. గుజరాత్ టైటాన్స్ రూ. 12.25 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. తొలి మ్యాచ్‌లో విఫలమైన సిరాజ్.. ముంబై ఇండియన్స్‌తో పాటు ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో నిప్పులు చెరిగాడు.తాజాగా సిరాజ్ ప్రదర్శనపై మాట్లాడిన సెహ్వాగ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయకపోవడం.. ఆర్‌సీబీ రిటైన్ చేసుకోకపోవడంతో సిరాజ్ బాగా హర్ట్ అయ్యాడని చెప్పాడు. 'చిన్నస్వామి మైదానంలో సిరాజ్ కొత్త బంతితో తన రికార్డ్‌ను కొనసాగించాడు. తొలి 3 ఓవర్లలో అతను 12 లేదా 13 పరుగులు మాత్రమే ఇచ్చాడు. అదే సమయంలో అతను నాలుగో ఓవర్ బౌలింగ్ చేసినా.. మరిన్ని వికెట్లు దక్కేవి. అతను బంతిని అద్భుతంగా స్వింగ్ చేశాడు. పిచ్ నుంచి కూడా సిరాజ్‌కు సహకారం లభించింది.అతనిలో మంచి ఫైర్ ఉంది. సిరాజ్ బాగా హర్ట్ అయినట్లు అర్థమవుతోంది. ఆర్‌సీబీ రిటైన్ చేసుకోకపోవడంతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయలేదనే మంట అతనిలో కనిపించింది. ఓ యువ బౌలర్ నుంచి మేం కోరుకునేది ఇదే. 'మీరు నన్ను సెలెక్ట్ చేయరా? నేనేందో చూపిస్తా'అనే అటిట్యూడ్ ఉండాలి. సిరాజ్ ఇదే జోరును కొనసాగించి టీమిండియాలోకి పునరాగమనం చేయాలని కోరుకుంటున్నా.'అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు.






## ముంబైని వదిలేసి.. సూర్యకుమార్ కూడా గోవా వెళ్తున్నాడా?



ముంబై : టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై జట్టును వీడనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముంబైని వదిలేసి అతను దేశవాళీ క్రికెట్‌లో గోవా జట్టు తరపున ఆడనున్నట్లు రూమర్స్ వ్యాపిస్తున్నాయి. ముంబై జట్టుకు చెందిన మరో క్రికెటర్ జైస్వాల్.. వచ్చే సీజన్ గోవా జట్టుకు ఆడనున్న విషయం తెలిసిందే. జైస్వాల్ తరహాలోనే సూర్యకుమార్ యాదవ్ కూడా వెళ్తున్నట్లు ఊహాగానాలు వినిపించాయి. అయితే ఆ వార్తలకు ముంబై క్రికెట్ సంఘం చెక్ పెట్టేసింది. ముంబై జట్టుకే ఆడేందుకు సూర్య కట్టుబడి ఉన్నట్లు ఎంసీఏ స్పష్టం చేసింది. సూర్యకుమార్ గురించి సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న రూమర్స్ గురించి తెలుసు అని ఎంసీఏ చెప్పింది. ఆ వార్తల్లో వాస్తవం లేదని ఎంసీఏ కార్యదర్శి అభయ్ హదాప్ పేర్కొన్నారు.సూర్యకుమార్‌తో ఇవాళ ఉదయం ఎంసీఏ అధికారులు ఈ అంశం గురించి చర్చించారు. గోవాకు సూర్య వెళ్తున్నట్లు వస్తున్న వార్తలు నిరాధారమైనవని పేర్కొన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దు అని ఎంసీఏ అధికారులు కోరారు. ప్లేయర్లకు సపోర్టు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఐపీఎల్‌లో ముంబై జట్టుకు ఆడుతున్న సూర్యకుమార్ ఇవాళ అయోధ్య రామాలయాన్ని విజిట్ చేశారు.వ్యక్తిగత కారణాల వల్ల క్రికెటర్ జైస్వాల్.. ముంబై నుంచి గోవా జట్టుకు వెళ్తున్న విషయం తెలిసిందే. జైస్వాల్ చేసిన రిక్వెస్ట్‌ను ముంబై క్రికెట్ సంఘం వెంటనే ఆమోదించింది. దీంతో 2025-26 సీజన్ నుంచి జైస్వాల్ గోవా తరపున దేశవాళీ క్రికెట్ ఆడనున్నాడు.

## అతనే నా భర్త.. నా జీవితం అతని చుట్టూ తిరుగుతూ ఉంటుంది : మహ్‌వశ్ ఆసక్తికర పోస్ట్





టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ జంట తమ వివాహ బంధానికి స్వస్తి పలికిన విషయం తెలిసిందే. గత నెల వీరికి ముంబై ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. కోర్టు తీర్పుతో ప్రస్తుతం ఎవరి జీవితాల్లో వాళ్లు ముందుకు వెళ్తున్నారు. అయితే, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ (ఖీఏ ఓజీఫ్త్రలజీబష్త్ర)తో చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహ్‌వశ్ తాజాగా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'హస్బెండ్' వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోకి చాహల్ లైక్ చేయడం ఆసక్తికరంగా మారింది.ఆ వీడియోలో మహ్‌వశ్ హిందీలో మాట్లాడుతూ.. 'నా జీవితంలోకి ఏ అబ్బాయి వస్తాడో.. అతనే నా జీవితంలో ఏకైక వ్యక్తి అవుతాడు. అతనే నాకు స్నేహితుడు. అతనే నా ప్రియుడు. అతనే నా భర్త. నా జీవితం అతని చుట్టూ తిరుగుతూ ఉంటుంది. నాకు అవసరం లేని వ్యక్తులు వద్దు. ఆ సమయంలో నేను ఇతర అబ్బాయిలతో కూడా మాట్లాడలేను' అని పేర్కొంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట తెగ ఆకర్షిస్తోంది. మహ్‌వశ్ షేర్ చేసిన ఈ రీల్ వీడియోని చాహల్ లైక్ చేశాడు. దీంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.ధనశ్రీ వర్మతో విడాకుల అనంతరం చాహల్ మళ్లీ ప్రేమలో పడ్డట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఆర్జే మహ్‌వశ్ తో చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు బీ టౌన్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్‌గా దుబాయ్ వేదికగా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరు కలిసి చూడడం.. మ్యాచ్‌కు ముందు ఓ సెల్ఫీ వీడియో, ఫొటోలను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ వార్తలకు బలం చేకురింది. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచే కాకుండా పలు ఈవెంట్స్‌లో కూడా ఇద్దరూ జంటగానే మెరిశారు. దీంతో చాహల్ మహ్‌వశ్‌తో ప్రేమలో పడ్డట్లు టాక్ నడుస్తోంది.

## మా జట్టులో పోకిరి వాడే: ట్రావిస్ హెడ్

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఇషాన్ కిషన్ పోకిరి అని ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు ట్రావిస్ హెడ్ అన్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌కు అధికారిక బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ఫన్ చిట్‌చాట్‌లో ఈ విషయాన్ని వెల్లడించాడు. ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్‌తో పాటు ప్యాట్ కమిన్స్ ఈ చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. సన్‌రైజర్స్ హెడ్ మాస్టర్, కరెంట్ తీగ, పోకిరి, ఊరమాస్ బ్యాటర్లు ఎవరో చెప్పారుఅప్‌కమింగ్ మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేస్తే ఈజీగా ప్లే ఆఫ్స్ చేరుతామని ట్రావిస్ హెడ్ తెలిపాడు. గత రెండు మ్యాచ్‌ల్లో కొన్ని విషయాల్లో తమకు కలిసి రాలేదని, టీ20ల్లో మూమెంటమ్ చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. 'ఆడబోయే కొన్ని మ్యాచ్‌ల్లో గెలిస్తే మంచి పొజిషన్‌లో ఉంటాం. ప్రస్తుతానికైతే టాప్-4లో ఉండటంపై ఫోకస్ పెట్టాం. ఆటగాళ్లంతా మంచి ఫామ్‌లో ఉన్నారు. లీగ్ దశ ముగిసేసరికి టాప్‌లో ఉంటే టైటిల్ గెలిచేందుకు మంచి అవకాశం ఉంటుంది. సానుకూల ధృక్పథంతో ఆడుతాం. అన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన ఫలితం దక్కకపోవచ్చు. తొలి మ్యాచ్‌లో మంచి ప్రదర్శన చేయగలిగాం. గత రెండు మ్యాచ్‌ల్లో కొన్ని విషయాల్లో మాకు కలిసి రాలేదు. టీ20 క్రికెట్ మూమెంటమ్ ముఖ్యం.'అని ట్రావిస్ హెడ్ చెప్పుకొచ్చాడు.



# ఉలవల వలన కలిగే ప్రయోజనాలతో మీ ఆరోగ్యం రేసుగుర్రం




ఉలవలు.. మనకు ఎన్నో పోషకాలను ఇచ్చే, మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేసే గింజ ధాన్యాలలో ఉలవలు ఒకటి. ఉలవలలో ఉండే ప్రయోజనాలు మరే ఆహార పదార్థాలలోను ఉండవు అంటే నమ్మి తీరాల్సిందే. అయితే ఉలవలు మనకు ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలను చూడండి.ఉలవలతో ఆరోగ్యంఉలవలు రుచికే కాదు ఆరోగ్యానికి చాలా మంచిది. ఉలవల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి.ఉలవల్లో ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, పీచుపదార్థం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఉలవల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఊబకాయం సమస్య ఉన్నవారు ఉలవలను ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది.చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుందిఅయితే వీరు ఉలవలను ఎలా ఆహారంలో చేర్చుకోవాలి అంటే ఉలవలను ఉడకబెట్టిన నీటిని చారుగా కాచి, ఉలవచారుని తీసుకుంటే చాలా మంచిది. ఇది చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. దీంతో క్రమ క్రమంగా ఊబకాయానికి చెక్ పెట్టవచ్చు. లావుగా ఉన్నవాళ్ళు బ్రేక్ ఫాస్ట్ లో ఉలవ పచ్చడి చేసుకొనే తింటే సన్నబడిపోతారు. ఉలవ పచ్చడి తినే వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మరింత రిజల్ట్ కనిపిస్తుంది.రక్త హీనతకు ఉలవలు బెస్ట్క్రమం తప్పకుండా పీరియడ్స్ రాని మహిళలలు ఎనిమిది గంటలు నానబెట్టిన ఉలవలు తినడం వలన ఆ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఉలవలు తీసుకునే సమయాల్లో మంచి నీరు ఎక్కువగా తాగాలి. రక్తహీనతతో బాధపడేవారు తొందరగా అలసటకు గురవుతారు.ఎప్పుడు నీరసంగా ఉంటారు మామూలు ఆహారంతో సరైన పోషకాలు అందక ఎప్పుడూ బలహీనంగా కనబడుతుంటారు. వారిలో చూపు మందగిస్తుంది ,జ్ఞాపక శక్తి కోల్పోతారు. ఇలాంటివారికి మంచి ఆహారం ఉలవలు అని చెప్పొచ్చు.తాటి ముంజలు తింటే భలే ఆరోగ్య ప్రయోజనాలు.. అసలే వదిలిపెట్టరు!ఈ సమస్యలకు ఉలవలతో చెక్ఉలవలు మన శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తాయి. ఉలవలు రక్త నాళాలలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ని కరిగించడంలో సహాయపడతాయి.ఉలవలు జీర్ణ శక్తిని మెరుగుపరుస్తాయి. ఆకలిని పెంచుతాయి.ఉలవలు కఫాన్ని తగ్గిస్తాయి. చర్మ సమస్యల నివారణలో, కీళ్ళ నొప్పుల నివారణలో బాగా పని చేస్తాయి.

# జ్ఞాపకశక్తి మందగిస్తుందా.. అయితే మెదడును షార్ప్‌గా ఉంచే ట్రిక్స్ ఇవిగో!

మన రోజువారీ జీవనశైలి, ఆహారం, ఒత్తిడి, శారీరక శ్రమలతో మానసిక సామర్థ్యం ప్రభావితమవుతుంది. కొన్నిసార్లు మతిమరపు సమస్యలు, సాధారణంగా గందరగోళం, ఏదైనా గుర్తు పట్టలేకపోవడం, ఏదైనా పని మరిచిపోవడం అనేవి సాధారణమే. కానీ దీర్ఘకాలికంగా జ్ఞాపకశక్తి మందగిస్తే, అది ఆందోళనకరమైన విషయం కావచ్చు. అయితే, సరైన ఆహారం, వ్యాయామం, మానసిక శ్రమ, జీవనశైలి మార్పులు ద్వారా మెదడును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. మెదడుకు సరైన ఆహారం అందించాలి శరీరానికి, ముఖ్యంగా మెదడుకు అవసరమైన పోషకాలు అందకపోతే జ్ఞాపకశక్తి మందగించవచ్చు. అందుకే, పోషకాహారం తీసుకోవడం అనేది అత్యంత కీలకం. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారాలను తీసుకోవాలి. ముఖ్యంగా చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్స్ తినడం మెదడుకు మేలు చేస్తాయి. యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే బెర్రీ పండ్లు, గ్రీన్ టీ, క్యారెట్, బీట్‌రూట్ లాంటి ఆహారాలు మెదడును ఉత్తేజితం చేస్తాయి. పెరుగును తినడం వల్ల దానిలోని ప్రొబయాటిక్స్ ఉండటం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. డార్క్ చాక్లెట్ కూడా జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇది మెదడుకు కావాల్సిన యాంటీఆక్సిడెంట్లు అందిస్తుంది. అంతే కాకుండా సపోటా, యాపిల్, అవకాడో, స్పినచ్ వంటి ఆహార పదార్థాలు మెదడును శక్తివంతంగా ఉంచుతాయి. వ్యాయామం ఓ ధ్యానం చేయడం శారీరక శ్రమ లేకపోతే మెదడు నెమ్మదించిపోతుంది. కాబట్టి వ్యాయామాన్ని నిత్యక్రియగా చేసుకోవాలి. నడక, జాగింగ్, యోగా వల్ల రక్త ప్రసరణను మెరుగుపరిచి మెదడుకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. ధ్యానం ఓ ప్రాణాయామం చేస్తే ఒత్తిడిని తగ్గించడంతో పాటు మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి. శరీర ధృఢత్వాన్ని పెంచే వ్యాయామాలైన స్ట్రెచింగ్, స్విమ్మింగ్, డాన్స్ వంటి శారీరక శ్రమలు మెదడు కణాలను ఉత్తేజితం చేస్తాయి. మెదడును శక్తివంతంగా ఉంచే అలవాట్లు క్రాస్‌వర్డ్స్, పజిల్స్, సుదోకు వంటి అలవాట్లు పెంచుకోండి. ఇది మెదడు చురుకుగా ఉండటానికి సహాయపడతాయి. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞాపకశక్తిని పెంచుతుంది . కొత్త భాష లేదా నైపుణ్యాన్ని అభ్యాసం చేయడం వల్ల మెదడు వినాశనాన్ని నివారించడంలో సహాయపడుతుంది. చిత్రలేఖనం, సంగీతం, క్రియేటివ్ ఆర్ట్స్ మీ మెదడు ఉత్తేజితంగా ఉండేందుకు సహాయపడతాయి. ఒత్తిడిని నియంత్రించుకోవడానికి ప్రయత్నించండి. రోజుకు 7-8 గంటలు నిద్రపోవడం ద్వారా మెదడు విశ్రాంతి తీసుకుంటుంది. అధిక బరువు మెదడు పనితీరును దెబ్బతీస్తుంది. పాజిటివ్‌గా ఉండడం అలవాటు చేసుకోండి. ఇది సంతోషంగా ఉండే వ్యక్తుల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ంశ్రీబనీ ఖీవజీట ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా? ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా? ఇంటి చిట్కాలు బాదం ఓ గుడ్డు తీసుకోండి. రోజూ 5-6 బాదం తినడం మెదడు చురుకుగా ఉండేందుకు సహాయపడుతుంది. అదే విధంగా మెంతులు ఓ జీలకర్ర నీళ్లు తాగడం అలవాటు చేసుకోండి. ఇవి మెదడుకు అవసరమైన పోషకాలను అందిస్తాయి. తులసి, అశ్వగంధ, బ్రాహ్మి వంటివి తీసుకోండి. ఇవి మెదడు శక్తిని పెంచే సహజమైన ఆయుర్వేద మూలికలుగా పనిచేస్తాయి. జ్ఞాపకశక్తి మందగించకుండా ఉండాలంటే, సరైన ఆహారం, వ్యాయామం, నిద్ర, మెదడుకు మానసిక శ్రమ ఇవన్నీ సమతుల్యంగా ఉండాలి. మన మెదడును ఉపయోగంలో ఉంచే ప్రయత్నం చేయాలి. జీవితంలో చిన్న మార్పులతో మెదడు సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం ద్వారా మెదడు చురుకుగా ఉండేలా చూసుకోవచ్చు.





# ఎక్కువసేపు కూర్చుంటున్నారా? అయితే ఈ డేంజర్ జబ్బులను ఆహ్వానించినట్లే!


నేటి ఆధునిక జీవనశైలిలో కూర్చోవడం సర్వ సాధారణమైపోయింది. మనం ఆఫీస్‌లో పని చేయడానికి, బస్సులో ప్రయాణం చేయడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, వినోదం కోసం ఇలా అన్నింటికి కూర్చుండిపోతున్నాం. వ్యాయాయం, నడక తగ్గిపోయింది. కానీ మీరు ఎక్కువసేపు కూర్చుంటే ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. లేనిపోని ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నాం. తాజాగా అధ్యయనాల్లో ఊహించని విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇది మన ఆరోగ్యాన్ని ఎలా దెబ్బతీస్తుందో తెలుసుకుందాం.. కూర్చోవడం గుండెకు శత్రువు! ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మీ రక్త ప్రసరణ మందగిస్తుంది, రక్త నాళాలు గట్టిపడతాయి , గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. వ్యాయామం చేయకపోవడం , ఎక్కువసేపు కూర్చోవడం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి, ఇది గుండె జబ్బులకు మరో కారణం. మధుమేహం వ్యాధికి ఆహ్వానం ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మీ శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించలేకపోతుంది, ఇది మధుమేహం (టైప్ 2 డయాబెటిస్) వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. వ్యాయామం చేయకపోవడం , ఎక్కువసేపు కూర్చోవడం వల్ల బరువు పెరుగుతారు, ఇది కూడా మధుమేహానికి దారితీస్తుంది. బరువు పెరగడానికి రహదారి ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మీరు తక్కువ కేలరీలు బర్న్ చేస్తారు, ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. వ్యాయామం చేయకపోవడం, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మీ జీవక్రియ మందగిస్తుంది, ఇది కూడా బరువు పెరగడానికి కారణమవుతుంది. ఊబకాయం అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది, కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. వెన్ను నొప్పి, మెడ నొప్పి ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మీ వెన్ను , మెడపై ఒత్తిడి పెరుగుతుంది, ఇది వెన్ను నొప్పి, మెడ నొప్పికి దారితీస్తుంది. తప్పు భంగిమలో కూర్చోవడం వల్ల ఈ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. సరైన భంగిమలో కూర్చోవడం , క్రమం తప్పకుండా లేచి తిరగడం వెన్ను నొప్పి , మెడ నొప్పిని నివారించడంలో సహాయపడుతుంది.తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి! క్యాన్సర్ కారకం కావచ్చు. కొన్ని అధ్యయనాలు ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం పెరుగుతుందని సూచిస్తున్నాయి, ముఖ్యంగా పెద్దప్రేగు క్యాన్సర్ , ఎండోమెట్రియల్ క్యాన్సర్. దీనికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియకపోయినా, ఎక్కువసేపు కూర్చోవడం వల్ల శరీరంపై అనేక ప్రతికూల ప్రభావాలు ఉంటాయని భావిస్తున్నారు, ఇది క్యాన్సర్ అభివృద్ధికి దోహదం చేస్తుంది. మానసిక ఆరోగ్యంపై దెబ్బ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల మీ మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. వ్యాయామం చేయకపోవడం , ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల మెదడులో సెరోటోనిన్ వంటి రసాయనాల ఉత్పత్తి తగ్గుతుంది, తద్వారా మతిస్థితిని తగ్గుతుంది. కూర్చోవడం తగ్గించడానికి మార్గం లేదా? ఎక్కువసేపు కూర్చోవడం వల్ల వచ్చే ప్రమాదాల గురించి తెలుసుకున్న తర్వాత, కూర్చోవడం తగ్గించడానికి కొన్ని మార్గాలను చూడటం ముఖ్యం. మీరు ఎక్కువసేపు కూర్చోవలసి వస్తే, ప్రతి 30 నిమిషాలకు ఒకసారి లేచి నిలబడండి, కొన్ని నిమిషాలు నడవండి లేదా సాగదీయడం చేయండి. వీలైతే, నిలబడి పనిచేయడానికి ప్రయత్నించండి. మీరు స్టాండింగ్ డెస్క్ ఉపయోగించవచ్చు లేదా మీ ల్యాప్‌టాప్‌ను ఎత్తుగా ఉంచి నిలబడి పనిచేయవచ్చు. ప్రయాణం చేయడానికి కారు లేదా బస్సుకు బదులుగా నడవడం లేదా సైకిల్ తొక్కడం ఎంచుకోండి. లిఫ్ట్ లేదా ఎస్కలేటర్ ఉపయోగించకుండా మెట్లు ఎక్కడానికి ప్రయత్నించండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఎక్కువసేపు కూర్చోవడం వల్ల వచ్చే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడానికి ప్రయత్నించండి.






# కూల్ డ్రింక్స్‌తో నోటి క్యాన్సర్ ముప్పు.. తాజా అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి!

ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు పెద్దలు. కానీ నేటి ఆధునిక జీవనశైలిలో ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా యువతరం కూల్ డ్రింక్స్, స్వీట్ డ్రింక్స్ అంటూ తీపి పానీయాలకు బానిసలవుతున్నారు. వీటివల్ల కలిగే అనర్థాల గురించి తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తాజాగా జరిగిన ఒక అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. రోజుకు ఒక్క తీపి పానీయం తాగే మహిళలకు నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఐదు రెట్లు ఎక్కువ అని తేలింది! నోటి కుహరంలో ఏర్పడే క్యాన్సర్ మహిళల్లో వేగంగా పెరుగుతోందని వాషింగ్టన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా పొగత్రాగని, మద్యం సేవించని యువతుల్లో ఈ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదు కావడం వైద్య నిపుణులను సైతం ఆందోళనకు గురిచేస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆహారపు అలవాట్లేనని పరిశోధకులు చెబుతున్నారు. జవా ఓటోలారిన్జాలజీ-హెడ్ అండ్ నెక్ సర్జరీ జర్నల్‌లో ప్రచురించబడిన ఈ అధ్యయనం ప్రకారం, తీపి పానీయాలకు పెద్దపేగు , జీర్ణశయాంతర క్యాన్సర్‌లతో సంబంధం ఉందని తెలిపింది. కానీ, తల, మెదడు క్యాన్సర్‌లతో వాటి సంబంధంపై ఇప్పటివరకు పెద్దగా పరిశోధనలు జరగలేదు. ఈ నేపథ్యంలో వాషింగ్టన్ విశ్వవిద్యాలయం చేసిన ఈ అధ్యయనం ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించింది. అయితే



"నోటి కుహర క్యాన్సర్.. రొమ్ము , పెద్దపేగు క్యాన్సర్ కంటే తక్కువ . ప్రతి సంవత్సరం 100,000 మందికి 4-4.3 కేసులు నమోదవుతున్నాయి. అయితే, పొగత్రాగని, మద్యం సేవించని మహిళల్లో నోటి కుహర క్యాన్సర్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది" అని అధ్యయన ప్రధాన రచయిత , వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ యొక్క ఓటోలారిన్జాలజీ హెడ్ అండ్ నెక్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రిటనీ బార్బర్ పేర్కొన్నారు. తీపి పదార్థాలు నేరుగా క్యాన్సర్‌కు కారణం కానప్పటికీ, వాటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. ఊబకాయం అనేక రకాల క్యాన్సర్లకు ముఖ్యంగా నోటి క్యాన్సర్‌కు ప్రధాన ప్రమాద కారకం అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, తీపి పానీయాలు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో మంట, డయాబెటిస్ వంటి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఇవి కూడా క్యాన్సర్‌కు కారణమయ్యేవే అని చెబుతున్నారు. ఈ ఆకులు దొరికితే ఆహారంలో చేర్చుకోండి!" నోటి క్యాన్సర్ అంటే ఏమిటి? నోటి క్యాన్సర్ మీ నోటి లోపల ఏర్పడుతుంది. ఇది పెదవులు, చిగుళ్ళు, నాలుక, బుగ్గలు, నోటి పైకప్పు లేదా నోటి దిగువ భాగంలో ఎక్కడైనా సంభవించవచ్చు. సాధారణంగా నోటిలో వచ్చే సమస్యల్లాగే ఇది కూడా మొదలవుతుంది. తెల్లటి మచ్చలు లేదా రక్తస్రావం అయ్యే పుండ్లు వంటివి కనిపిస్తాయి. కానీ సాధారణ సమస్యలకు, క్యాన్సర్‌కు మధ్య తేడా ఏమిటంటే, ఈ మార్పులు రెండు వారాల్లో తగ్గవు. చికిత్స చేయకుండా వదిలేస్తే, నోటి క్యాన్సర్ మీ నోరు , గొంతు నుండి తల , మెడలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, నోటి కుహర క్యాన్సర్ నిర్ధారణ అయిన ఐదేళ్ల తర్వాత 63 శాతం మంది మాత్రమే జీవించి ఉన్నారు. అందుకే, నోటి క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం చాలా ముఖ్యం. నోటి క్యాన్సర్ సంకేతాలు, లక్షణాలు: నోటి క్యాన్సర్‌కు సంబంధించిన అనేక సంకేతాలు , లక్షణాలు సాధారణ సమస్యలు లేదా నోటిలో వచ్చే మార్పులుగా పొరబడే అవకాశం ఉంది.పెదవిపై లేదా నోటి లోపల పుండ్లు సులభంగా రక్తస్రావం అవుతాయి, రెండు వారాల్లో నయం కావు. నోటిలో కారణం లేకుండా రక్తస్రావం అవడం. ముఖం , మెడపై లేదా నోటిలో తిమ్మిరి, నొప్పి లేదా సున్నితత్వం కనిపించడం. నమలడం లేదా మింగడం, మాట్లాడటం లేదా దవడ లేదా నాలుకను కదిలించడంలో ఇబ్బంది. కారణం లేకుండా బరువు తగ్గడం. దీర్ఘకాలిక దుర్వాసన రావడం వంటి లక్షణాలు కన్పించవచ్చు. కాబట్టి, వీటిని తేలికగా తీసుకోకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది. " అనారోగ్యాల పాలు చేస్తున్న తీపి పానీయాలు తాగడం తగ్గించండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి. నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి. నోటిలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించండి. ముందు జాగ్రత్తలు తీసుకుంటే, నోటి క్యాన్సర్ ముప్పును నివారించవచ్చు.




# పూరీని విమర్శించిన నెటిజన్‌పై ఫైర్ అయిన యాక్టర్



హిట్టూ ఫ్లాపుతో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్లే డైరెక్టర్లలో డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ఒకరు. పూరీ డైరెక్షన్ కు, ఆయన టేకింగ్ కు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఒకప్పుడు టాలీవుడ్ లో స్టార్ డైరెక్టర్ గా ఓ వెలుగు వెలిగిన పూరీ జగన్నాథ్ గత కొన్ని సినిమాలుగా సరైన సక్సెస్ లేక ఇబ్బంది పడుతున్నారు. పూరీ ఆఖరిగా హిట్ చూసింది ఇస్మార్ట్ శంకర్ సినిమాతోనే.ఆ సినిమా తర్వాత విజయ్ దేవరకొండ తో పాన్ ఇండియా స్థాయిలో లైగర్ సినిమా చేస్తే అది డిజాస్టర్ అయింది. తర్వాత కొంత గ్యాప్ తీసుకుని ఇస్మార్ట్ శంకర్ కు సీక్వెల్ గా డబుల్ ఇస్మార్ట్ చేస్తే అది ఇంకా ఘోరంగా ఫ్లాపైంది. దీంతో పూరీపై ఉన్న నమ్మకం పోయింది. ఇలాంటి టైమ్ లో పూరీ తన తర్వాతి సినిమాను ఎవరితో చేస్తాడా అనుకుంటున్న టైమ్ లో పూరీ అందరికీ షాకిస్తూ విజయ్ సేతుపతితో ప్రాజెక్టును అనౌన్స్ చేశారు. గత కొన్నాళ్లుగా వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా వస్తుందని వార్తలు వినిపిస్తున్నప్పటికీ అందులో నిజమెంత అని అందరూ లైట్ తీసుకున్నారు. అయితే పూరీ అందరికీ షాకిస్తూ ఉగాది రోజున ఈ ప్రాజెక్టును అనౌన్స్ చేశారు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ లో ఛార్మీ, పూరీ కలిసి ఈ సినిమాను నిర్మించనున్నారు. విలన్ గా, హీరోగా, సపోర్టింగ్ ఆర్టిస్టు గా పలు భాషల్లో పేరు తెచ్చుకున్న విజయ్ సేతుపతి లాంటి నటుడితో పూరీ సినిమాను అనౌన్స్ చేసి అందరితో క్రేజీ కాంబినేషన్ అనిపించుకుంటున్నారు.పూరీ తో విజయ్ సేతువతి సినిమా చేస్తున్న విషయాన్ని వలువురు నెటిజన్లు జీర్ణించుకోలేకపోతున్నారు. పూరీ అవుట్‌డేటెడ్ అయ్యారని, మహారాజా లాంటి సూపర్ హిట్ తర్వాత పూరీ డైరెక్షన్ లో సినిమా చేయడానికి ఎలా ఒప్పుకున్నారని సేతుపతిని అడుగుతూ పూరీని విమర్శిస్తూ ఓ నెటిజన్ పోస్ట్ పెట్టగా, ఆ పోస్టుకు యాక్టర్ శాంతను భాగ్యరాజ్ స్పందించారు. ఫిల్మ్ ఇండస్ట్రీకి సంబంధించిన వ్యక్తుల గురించి అలా మాట్లాడొద్దని, సోషల్ మీడియాలో పోస్ట్ చేసేటప్పుడు సరైన పదాలు వాడటం నేర్చుకోవాలని, పూరీ ఓ ఫేమస్ డైరెక్టర్. ఆయనకు గౌరవం ఇవ్వడం నేర్చుకోమని శాంతను పోస్ట్ చేయడంతో ఆ నెటిజన్ సారీ చెప్పి పూరీని విమర్శిస్తూ చేసిన పోస్ట్ ను తన సోషల్ మీడియా నుంచి డిలీట్ చేశాడు. ఇదిలా ఉంటే పూరీ జగన్నాథ్–విజయ్ సేతుపతి కాంబినేషన్ లో రానున్న సినిమా ఈ ఏడాది జూన్ నుంచి సెట్స్ పైకి వెళ్తుందని, ఈ సినిమాకు బెగ్గర్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

# దుమ్ముదులుపుతున్న చిన్న సినిమా

కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు స్టార్ హీరో సినిమానా?, స్టార్ డైరెక్టర్ సినిమానా? అని చూడటం లేదు. చిన్న సినిమా అయినా సరే కంటెంట్ ఆలోచింపజేసే విధంగా ఉంటే ఆ సినిమాలకు బ్రహ్మరథం పడుతున్నారు. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నారు. ఇది చాలా సినిమాల విషయంలో రుజువైంది కూడా. తాజాగా మరోసారి చిన్న సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతూ కలెక్షన్‌ల వర్షం కురిపిస్తుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. నేచురల్ స్టార్ నాని వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ'. ప్రియదర్శి కీలక పాత్రలో నటించగా హర్షా రోషన్, శ్రీదేవి, శివాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. థియేటర్‌కి తక్కువ.ఓటీటీకి ఎక్కువ అనే కామెంట్‌లు నిర్మాణం నుంచే వినిపించినా సినిమాపై నమ్మకంతో హీరో నాని ఈ మూవీని థియేట్రికల్ రిలీజ్ చేయడం తెలిసిందే. ఎలాంటి అంచనాలు లేకుండా మార్చి 14న విడుదైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తూ విమర్శకులని విస్మయానికి గురి చేస్తోంది. ం పది కోట్లలోపు బడ్జెట్‌తో కొత్త దర్శకుడు రామ్ జగదీష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇప్పటి వరకు రూ.50 కోట్లకు పైనే రాబట్టింది. ఓవర్సీస్‌లోనూ సత్తాచాటుతూ వన్ మిలియన్‌మార్కుని దాటేసి అక్కడ కూడా దుమ్ముదులిపేస్తోంది. ఇక ఇదే తరహాలో మరో చిన్న సినిమా కూడా బాక్సాఫీస్‌ని రఫ్ఫాడించేస్తోంది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ నటించిన మూవీ 'మ్యాడ్ స్క్వేర్'. మ్యాడ్ మూవీకి సీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకొచ్చింది. లాజిక్‌లతో సంబంధంలేకుండా ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. లడ్డుగాని పెళ్లి నేపథ్యంలో సాగే వినోదాత్మక కథగా ఆద్యంత యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు కళ్యాణ్ శంకర్ రూపొందించారు. రిలీజ్ రోజు మిక్స్ టాక్‌ని సొంతం చేసుకున్న ఈ మూవీ తొలి రోజు వసూళ్లతో ఆశ్చర్యపరిచింది. ఇప్పటి వరకు ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా 60 కోట్లకు పైనే రాబట్టడం విశేషం. ఇలా చిన్న సినిమాలుగా విడుదలై వరల్డ్ వైడ్‌గా ఈ రెండు సినిమాలు కాసుల వర్షం కురిపిస్తుండటంతో చిన్న సినిమాల నిర్మాతలు మరింత జోష్‌తో మరిన్ని చిన్న చిత్రాలని నిర్మించడానికి ముందుకొస్తుండటం విశేషం.




# వారి కంటే రజనీకాంత్ చాలా బెటర్!




కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ సింప్లిసిటీ గురించి ఎంత మాట్లాడుకున్నా తక్కువే. సూపర్ స్టార్‌గా వరుస సినిమాలు చేస్తూ ఉండే రజనీకాంత్ రియల్ లైఫ్ లో చాలా సింపుల్‌గా ఉంటారు. ఆయన ఎక్కడకు వెళ్ళినా హంగామా లేకుండానే వెళ్తారు. ముఖ్యంగా రజనీకాంత్ సినిమాలో తప్ప ఎప్పుడూ బయటకు వెళ్లినప్పుడు విగ్ ను పెట్టుకుని కనిపించలేదు. అంతే కాకుండా ఆయన కెమెరా ముందు మాత్రమే మేకప్‌తో కనిపిస్తారు. ఆ తర్వాత ఎప్పుడూ కూడా మేకప్‌తో కనిపించరు. ఏ కార్యక్రమంలో కనిపించినా ఆయన బట్ట తలతోనే మనం చూస్తూ ఉంటాం. అంతే కాకుండా ఆయన్ను ఎక్కువగా మేకప్ లేకుండానే చూస్తూ ఉంటాం మ్యాడ్ బాయ్ తో నిహారిక న్యూ కాంబో రజనీకాంత్ సింప్లిసిటీ గురించి బాలీవుడ్ స్టార్ నటుడు ముఖేష్ ఖన్నా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ స్టార్స్‌తో పోల్చుతూ ఆయన రజనీకాంత్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఒకప్పుడు బుల్లి తెరపై, ఆ తర్వాత వెండి తెరపై తనదైన సత్తా చాటిన ముఖేష్ ఖన్నా శక్తిమాన్ గా దేశ వ్యాప్తంగా పాపులారిటీని సొంతం చేసుకున్నాడు. ఒకప్పుడు శక్తిమాన్ అంటూ పిలిపించుకున్న ముఖేష్ ఖన్నా మధ్యలో కొన్నాళు కనిపించకుండా పోయారు. కానీ ఈ మధ్య ఈయన తెగ వార్తల్లో నిలుస్తున్నారు. ఈమధ్య కాలంలో బాలీవుడ్‌లో వచ్చిన మార్పులపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ పలువురిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ముఖేష్ ఖన్నా మాట్లాడుతూ... బాలీవుడ్‌లో ఎంతో మంది స్టార్స్ ఉన్నప్పటికీ వారందరి కన్నా రజనీకాంత్ చాలా బెటర్. ఇతర స్టార్స్ మాదిరిగా కాకుండా రజనీకాంత్ ఎప్పుడూ తన అభిమానులతో సన్నిహితంగా ఉంటారు. అంతే కాకుండా అభిమానులతో చాలా స్వచ్ఛంగా ఆయన ఉంటారు. ఎప్పుడూ మేకప్, విగ్ లేకుండానే కార్యక్రమాల్లో పాల్గొంటారు. తన స్టార్‌డంను పట్టించుకోకుండా బయటి ప్రపంచంలో ఉంటారు. ఆయన గొప్ప వ్యక్తి అంటూ ముఖేష్ ఖన్నా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా రజనీకాంత్‌కి అభిమానులు ఉంటారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. రజనీకాంత్ సినిమాల విషయానికి వస్తే కెరీర్ ఖతం అనుకుంటున్న సమయంలో జైలర్ సినిమాతో ఇండస్ట్రీ హిట్ కొట్టడంతో మళ్లీ పుంజుకున్నారు. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు సాధిస్తున్న రజనీకాంత్ ఈ ఏడాదిలో కూలీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.



# ప్రభాస్ తో మళ్లీ బాలీవుడ్ బ్యూటీ..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఓవైపు మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ ను.. మరోవైపు హను రాఘవపూడి డైరెక్షన్ లో పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంప్లీట్ చేస్తున్నారు. త్వరలోనే ఆ రెండు సినిమాలతో థియేటర్లలో సందడి చేయనున్నారు మన డార్లింగ్. అయితే హను రాఘవపూడి మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వరుస షెడ్యూళ్లతో మేకర్స్ చిత్రీకరణను త్వరగా పూర్తి చేసే యోచనలో ఉన్నారు. ఇప్పటికే ఆ సినిమాలో హీరోయిన్ గా కొత్త అందం ఇమాన్వీని ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. ఇన్ స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ అయిన ఆమె.. ప్రభాస్ మూవీతో ఎంట్రీ ఇస్తోంది.అనిల్ ఇప్పుడు ఆ మూవీలో మరో హీరోయిన్ గా బాలీవుడ్ బ్యూటీని ఫిక్స్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. రీసెంట్ గా దిశా పటానీని మేకర్స్ సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆమెను ఇప్పటికే ఫిక్స్ చేశారని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు. అయితే దీనిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. అదే సమయంలో దిశా పటానీ ఓకే చెబితే.. ఆమె మరోసారి ప్రభాస్ తో జత కట్టినట్లు అవుద్దన్న విషయం తెలిసిందే. ఇప్పటికే కల్కి మూవీలో ప్రభాస్, దిశా పటానీ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇప్పుడు హను రాఘవపూడి మూవీలో మళ్లీ జోడీగా నటించనున్నట్లు సమాచారం. ఆ సినిమా తర్వాత కల్కి 2898 ఏడీ సీక్వెల్ లో కూడా ప్రభాస్, దిశా పటానీ జోడీగా సందడి చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అందుకు దిశా ఓకే చెప్పేసిందని టాక్ వినిపిస్తోంది. త్వరలో స్టార్ట్ కానున్న షూటింగ్ లో కూడా పాల్గొనుందని తెలుస్తోంది. అలా టాలీవుడ్ లో అమ్మడు బిజీ కానుందన్నమాట. దిశా విషయానికొస్తే.. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని లైమ్ లైట్ లోకి వచ్చింది. ఆ తర్వాత మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లోఫర్ సినిమాతో టాలీవుడ్ హీరోయిన్ గా పరిచయమైంది. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో బాలీవుడ్ కు షిఫ్ట్ అయిన బ్యూటీ.. కల్కి మూవీతో మళ్లీ అడుగు పెట్టింది. ఇప్పుడు ఇక్కడ మంచి అవకాశాలు అందుకుంటోంది!



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**